# మనసులో మాట

KANCHARLA | నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. | సంచలన తెలుగు దిన పత్రిక

## అమరావతి

| | | |
|---|---|---|
| ఎన్టీఆర్ | పల్నాడు | కృష్ణ |
| గుంటూరు | బాపట్ల | ప్రకాశం |

బుధవారం 3 జూన్ 2026 | పేజీలు 16


# జూన్ 7 నుంచి 20వరకు యోగా

- 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



**గుంటూరు, జూన్ 2( మనసులో మాట):**

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను 'యోగాంధ్ర 2026' పేరుతో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ మంగళవారం తెలిపారు. 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్ నినాదంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరుగుతాయని చెప్పారు. యోగా ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయడమే ..మిగతా 2లో



# గుంటూరు నగరాన్ని సందర్శించిన యూనిడో ప్రతినిధులు

- అభివృద్ధి, పారిశుద్ధ్యం, వినూత్న కార్యక్రమాల పరిశీలన

**గుంటూరు, జూన్ 2(మనసులో మాట) :**

గుంటూరులో పారిశుధ్య, పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలను, సుస్థిర పట్టణాభివృద్ధి, ప్రజారోగ్య పరిరక్షణ, ఆధునిక పారిశుధ్య నిర్వహణలో గుంటూరు నగరపాలక సంస్థ అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలను యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (యూనిడో) ప్రతినిధులు, రాష్ట్రంలోని వివిధ నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీల కమిషనర్ల బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ బృందానికి నగరంలో యూనిడో సహకారంతో అమలు చేస్తున్న పలు వినూత్న కార్యక్రమాల గురించి, ముఖ్యంగా ప్రజారోగ్య పరిరక్షణ, పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు ఈఆటోల వినియోగం, వాటి ద్వారా చెత్త సేకరణ, శుభ్రత కార్యక్రమాల నిర్వహణ, పర్యావరణ హిత సాంకేతికతలకు ప్రాధాన్యత ..మిగతా 2లో




# నేడు విజ్ఞాన్స్ వర్సిటీలో "గూగుల్ ఏఐ ల్యాబ్" ప్రారంభోత్సవం

4

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో విద్యార్థులను ప్రపంచస్థాయి నైపుణ్యాలతో తీర్చిదిద్దే దిశగా విజ్ఞాన్స్ యూనివర్సిటీ మరో కీలక ముందడుగు వేసింది

# నేడు నగరానికి సీఎం రాక



**గుంటూరు జూన్ 2 (మనసులో మాట ):**

ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు గుంటూరు రానున్నారు.నగరంలోని తక్కెళ్ళపాడు ప్రాంతంలో లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నూతన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరవుతారు. ఉదయం 10 గంటల 40 నిమిషాలకు సీఎం హెలికాప్టర్ ద్వారా తక్కెళ్ళపాడు రానున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గుంటూరు పర్యటన ఏర్పాట్లను నగర కమిషనర్ మయూర్ అశోక్ పరిశీలించారు. లలితా హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో హెలిప్యాడ్, నేషనల్ హై వే, హాస్పిటల్ ఆవరణ, సభాప్రాంగణం తదితర ప్రాంతాలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పివియస్ లలితా హాస్పిటల్ ప్రారంభోత్సవానికి గుంటూరు రానున్న సందర్భంగా ఏర్పాట్లు ..మిగతా 2లో

# ఆర్థిక భద్రతతోనే మహిళల జీవితాల్లో వెలుగులు : ప్రత్తిపాటి

- సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగిపోతేనే వేగవంతమైన అభివృద్ధి
- సామాజిక సేవా సంస్థలు, సంపన్నులు ప్రభుత్వ ఆశయంలో భాగం కావాలి.
- పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసిన ప్రత్తిపాటి.




2

# జూన్ 7 నుంచి 20వరకు యోగా

(మొదటి పేజీ తరువాయి)



లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. అన్ని రంగాల్లో ఉన్నవారిని యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామన్నారు. ఈ నెల్ల 7 నుంచి 20వ తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు చేపట్టి ప్రచారం చేయడం జరుగుతుందని తెలిపారు. జూన్ 21న రాష్ట్ర స్థాయి యోగా దినోత్సవ వేడుకలు అమరావతిలో జరుగుతాయన్నారు. జిల్లాలో ఉండవల్లి గుహలు, మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వంటి ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. జూన్ 7 నుంచి 9వ తేదీ వరకు గ్రామ, వార్డు స్థాయిలోనూ, జూన్ 10 నుంచి 12వ తేదీ వరకు మండల స్థాయిలోనూ, జూన్ 14 నుంచి 16వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయని వివరించారు. జూన్ 18 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయని తెలిపారు. వ్యక్తిగత విభాగం, బృంద విభాగం, జ్ఞాన ఆధారిత యోగా పోటీలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. వ్యక్తిగత విభాగంలో ఆసనాల ప్రదర్శన, ప్రాణాయామం., జ్ఞాన ఆధారిత పోటీలలో యోగా క్విజ్, యోగా వ్యాసరచన, యోగా నినాదాల పోటీలు ఉంటాయన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని పార్కులు, పాఠశాలలు, క్రీడా ప్రాంగణాల్లో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.



# నేడు నగరానికి సీఎం రాక

(మొదటి పేజీ తరువాయి)

పక్కాగా ఉండాలని ఆధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్, నేషనల్ హై వే, హాస్పిటల్ ఆవరణ, సభాప్రాంగణం తదితర ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించి, సదరు ప్రాంతాలలో పారిశుధ్యం పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి గారి పర్యటన జరుగు సమయంలో సమీప గ్రామాల ప్రజలు వారి పశువులు రోడ్ల పైకి వదలకుండా చర్యలు తీసుకువాలన్నారు. సి.యం గారి భద్రత పరంగా తీసుకోవాల్సిన అంశాల పై పోలీస్ శాఖ వారి సూచనల ప్రకారం చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సభా ప్రాంగణం వద్ద పారిశుధ్య పనుల పై అధికారులు ద్రుష్టి సారించాలని, సదరు ప్రాంతంలో పారిశుధ్య పరంగా ఎటువంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్యాదికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు కలిసి గౌరవ సియం గారి గుంటూరు పర్యటనలో ఎటువంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సదరు పర్యటనలో డిప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాసరావు, యం.హెచ్.ఓ డాక్టర్ సురేష్, రెవిన్యూ అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు నగరాన్ని సందర్శించిన యూనిడో ప్రతినిధులు

(మొదటి పేజీ తరువాయి)

ఇస్త్రూ రిజర్వాయర్ల వద్ద ఈఆటోలకు అవసరమైన ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసిన విధానాన్ని వివరించారు.




అనంతరం బృందం ఐపీడీ కాలనీలో డోర్‌టుడోర్ చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించింది. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానం, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు, చెత్త నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న తీరును అధికారులు వివరించారు. ఎన్ఎస్‌కేఎఫ్డీసీ సహకారంతో ర్యాగ్ పికర్స్ కి అందించిన వాహనాలను పరిశీలించి, వారితో మాట్లాడారు. తదుపరి సంగం జాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ పనితీరును పరిశీలించారు. నీటి వనరులపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తితో పాటు నీటి ఆవిరీభవనాన్ని తగ్గించే ప్రయోజనాలను కమిషనర్ వివరించారు.

పర్యటన అనంతరం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ సురభి మాలిక్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో పారిశుధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణ అనుకూల కార్యక్రమాల అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రజారోగ్య రంగంలో చేపడుతున్న కార్యక్రమాలు ఫలితాలను ఇస్తున్నాయని, భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం, యూనిడో సంయుక్త సహకారంతో పట్టణాభివృద్ధి, పారిశుధ్యం, పునరుత్పాదక ఇంధన రంగాల్లో మరిన్ని కార్యక్రమాలను అమలు చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గుంటూరులో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఇతర నగరాల్లో కూడా విస్తరించేందుకు పరిశీలిస్తామని వెల్లడించారు.

# ఆర్థిక భద్రతతోనే మహిళల జీవితాల్లో వెలుగులు : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట జూన్ 02 మనసులో మాట**

రెక్కల కష్టం, శక్తియుక్తులతో జీవించే పేద, మధ్య తరగతి మహిళల జీవితాలు మెరుగుపడి, ఆర్థిక భద్రత లభిస్తేనే, సమాజానికి మేలు జరుగుతుందని, ఆ దిశగా స్వచ్ఛంద సంస్థలతో పాటు.. కార్పొరేట్ సంస్థలు తమ సహాయ సహకారాలు అందించాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. మంగళవారం ఆయన పట్టణ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో జి.డి.యం.సి. చైర్మన్ వర్ధణం హరిబాబు తో కలిసి పాల్గొని, 20 మంది మహిళలకు కుట్టుమిషన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రోటరీ క్లబ్ నిర్వాహకుల సేవల్ని కొనియాడారు. రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పంలో సామాజిక, సేవా సంస్థలు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. ప్రజా సేవకు రాజకీయాలతో పనిలేదని, మంచి చేయాలనే ఆశయం, ఆలోచన ఉంటే సరిపోతుందన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగినప్పుడే రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. మారుతున్న కాలంతో పాటు.. సంపన్నులు, సామాజికంగా, ఆర్థికంగా బలంగా ఉన్నవారి ఆలోచనా విధానం మారాలని, అప్పుడే పేదరికమనే జబ్బు మాయమవుతుందన్నారు. ప్రభుత్వ ఆశయానికి ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు, ప్రజల సహకారం తోడైతేనే పీ4 విజయవంతంగా అమలవుతుందని ప్రత్తిపాటి చెప్పారు.




కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కందిమల్ల జయమ్మ, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మండల పార్టీ అధ్యక్షులు కామినేని సాయిబాబు, రోటరీ క్లబ్ సభ్యులు ఉప్పుటూరి ప్రసాద్, బోడే రామసుబ్బారావు, చిలుకూరి శ్రీనివాసరావు, కాంతయ్య, అడుసుమల్లి మోహన్ రావు, సాంబశివరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళా విజయవంతం

**గుంటూరు జూన్ 2 (మనసులో మాట )**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి తెలిపారు. యువతే రాష్ట్ర భవిష్యత్తు అని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (APSSDC) సహకారంతో, ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరులోని హిందూ ఫార్మసీ కళాశాల, అమరావతి రోడ్‌లో మెగా జాబ్ మేళా ఘనంగా నిర్వహించారు.



ఈ మెగా జాబ్ మేళాకు మొత్తం 742 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకాగా, ప్రాథమిక ఎంపికల్లో 365 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె. సంజీవరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని, అందులో భాగంగా ఉద్యోగ మేళాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో ఇంకుక్స్ ఏఐ ప్రైవేట్ లిమిటెడ్, క్లౌడ్ మెల్లో టెక్నాలజీస్ ఎల్ఎల్‌పి, మాల్టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బుక్ ఎక్స్‌పర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రైమారియా హెల్త్ కేర్, డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపెక్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, స్కిల్జా గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్యూచర్ ఐటి సొల్యూషన్స్ లిమిటెడ్ సహా 30కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. మొత్తం 1,100 ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంచగా, వివిధ విద్యార్హతలు కలిగిన యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారని చెప్పారు.హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇలాంటి ఉపాధి కార్యక్రమాలకు తమ కళాశాల ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీల,టీడీపీ పార్లమెంట్ సెక్రటరీ గంటా మౌళిక మాట్లాడు యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జిల్లా ఉపాధి అధికారి అభినవ్ మాట్లాడుతూ... యువతకు మరింత ఉపాధి

# ఎఫ్ఎల్ఎన్ డీఆర్పీల ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం విజయవంతం

- **ఉపాధ్యాయులు అంకితభావంతో నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించాలి – ఆర్జేడీ లింగేశ్వర్ రెడ్డి**

**ఒంగోలు జూన్ 2 (మనసులోమాట)**



ఒంగోలు రామచంద్ర మిషన్‌లో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) డీఆర్పీల ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమాన్ని గుంటూరు రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) లింగేశ్వర్ రెడ్డి, మార్కాపురం జిల్లా విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు సందర్శించి శిక్షణ పొందుతున్న డీఆర్పీలతో ముచ్చటించి విలువైన సూచనలు అందించారు.
ఈ సందర్భంగా ఆర్జేడీ లింగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, నిపుణ్ భారత్ లక్ష్యాల సాధనలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను సమర్థవంతంగా అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు.
మార్కాపురం డీఈఓ సామా సుబ్బారావు మాట్లాడుతూ, విద్యార్థి కేంద్రిత విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. డిజిటల్ పరికరాల వినియోగంతో బోధనను మరింత అర్థవంతంగా చేయాలని, తమ జ్ఞానం మరియు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఎక్కువ పుస్తకాలు చదవడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ ఐదు రోజుల శిక్షణలో అనుభవజ్ఞులైన కేఆర్పీలు తెలుగు, ఆంగ్లం, గణితం, జాతీయ విద్యా విధానం-2020 (ఎన్ఈపీ 2020), టీఏఆర్ఎల్ , దీక్ష, మిస్ కాన్సెప్ట్స్, కరిక్యులర్ గోల్స్ అండ్ కంపిటెన్సీస్ వంటి అంశాలపై డీఆర్పీలకు సమగ్ర శిక్షణ అందించారు.
శిక్షణా కాలంలో ప్రకాశం జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి. రేణుక, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ దాసరి అనిల్ కుమార్ హాజరై శిక్షణార్థులకు విలువైన సూచనలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.
ఈ నెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏఎంఓ నాగేంద్ర నాయక్ వెల్లడించారు. ఒంగోలు మండల విద్యాశాఖ అధికారి కిషోర్ కుమార్, శిక్షణ పరిశీలకురాలు సౌజన్య, కేఆర్పీలు అర్రిబోయిన రాంబాబు, అంబటి బ్రహ్మయ్య, రాజేష్, వీరభద్రం, ప్రకాశం ,మార్కాపురం జిల్లాల డి ఆర్ పి లు పాల్గొన్నారు.

# వచ్చే మార్చి నాటికి రెవెన్యూ సమస్యల రహిత ప్రకాశం జిల్లా ఆవిష్కరణే లక్ష్యం

- **జిల్లా కలెక్టర్ రాజబాబు**

**ఒంగోలు జూన్ 2(మనసులో మాట)**



వచ్చే ఏడాది మార్చి నాటికి రెవెన్యూ సమస్యల రహిత ప్రకాశం జిల్లా ఆవిష్కరణే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. మంగళవారం ప్రకాశం భవనంలో ఒంగోలు డివిజన్ స్థాయి రెవెన్యూ సదస్సు జరిగింది. జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారితో కలిసి జిల్లాలోని రెవెన్యూ సమస్యల పరిష్కార పురోగతిపై ఆయన సమీక్షించారు. ఈ సమస్యలను సకాలంలో సహేతుకంగా పరిష్కరించి ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెరిగేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని రెవిన్యూ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయిలో రెవిన్యూ సమస్యల పరిష్కారం కోసం వస్తున్న ప్రజల పట్ల వీఆర్వోల ప్రవర్తన దురుసుగా ఉంటే సహించబోనని ఆయన హెచ్చరించారు. సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజలతో వ్యవహరించే విధానం కూడా మర్యాదపూర్వకంగా ఉండాలన్నారు. భూ ఆక్రమణలపై ఉదాసీనంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ స్పష్టం చేశారు. రెవెన్యూకి సంబంధించిన ' మీకోసం ' అర్జీల పట్ల వీఆర్వోలు వ్యవహరిస్తున్న తీరును తహసిల్దార్లు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని ఆయన చెప్పారు. మ్యుటేషన్లు, కుల, మరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జాప్యం లేకుండా మంజూరు చేయాలన్నారు. రీసర్వే, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో వచ్చే నెలకు గణనీయమైన పురోగతి ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆర్డీవో స్థాయిలో నెలకు రెండుసార్లు, తహసిల్దార్ స్థాయిలో వారానికి ఒకసారి ఈ విధమైన రెవిన్యూ సదస్సును నిర్వహించి క్షేత్రస్థాయి సమస్యల పరిష్కార పురోగతిపై సమీక్షించాలని ఆదేశించారు. నిరంతర పర్యవేక్షణ ద్వారా రెవిన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తనతో పాటు కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని ఆమె చెప్పారు. డి నిషేధిత 22( ఏ ) భూములు, జీరో ఖాతాలు, ఇతర రెవెన్యూ అంశాలపైనా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమీక్షించి మార్గనిర్దేశం చేశారు. ఇన్చార్జి డీ.ఆర్.వో. మాధురి, ఆర్డిఓ చంద్రశేఖర్ నాయుడు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

# మంత్రి సవిత నివాసంలో భేటీ అయిన మంత్రులు

**టంగుటూరు, జూన్ 2, (మనసులోమాట)**

తాడేపల్లిలోని మంత్రి సవిత గారి నివాసంలో మర్యాద పూర్వకంగా భేటీ అయిన మంత్రులు డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి , ఎస్. సవిత , ఎమ్మెల్సీ తిప్పేస్వామి .





# అర్హులు కౌలు రైతు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

**భట్టిప్రోలు జూన్ 2 మనసులో మాట**

అర్హత కలిగిన కవులు రైతులు సి సి ఆర్ సి కార్డులు పొందవచ్చునని వ్యవసాయ రెవెన్యూ అధికారులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన పార్టీప్రోలు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కవులు రైతుల అవగాహన సదస్సులో అధికారులు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్డులు కావలసిన కవులు రైతులు పట్టాదారు పాసుపుస్తకం, భూ యజమాని అంగీకార పత్రం,ఆధార్ కార్డులు జిరాక్స్ లు,ఫోటోలు, ఇరువురి ఫోన్ నెంబర్లు తో దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో పి కాళీకృష్ణ, వ్యవసాయ శాఖ కు చెందిన లక్ష్మీప్రసన్న, వలి తదితరులు పాల్గొన్నారు.



# ఖేత్ బచావ్ అభియాన్

**రేపల్లె జూన్2మనసులోమాట**

రైతులకు భూమి సంరక్షణ, నేల ఆరోగ్యం పరిరక్షణ మరియు స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై అరవపల్లి గ్రామంలో వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ భూమి సారాన్ని కాపాడుకోవడానికి సేంద్రియ ఎరువుల వినియోగం, పంటల మార్పిడి విధానం, నేల పరీక్షల ప్రాముఖ్యత వంటి అంశాలనుమంగళవారం వివరించారు. అలాగే రసాయనిక ఎరువులు మరియు పురుగుమందులను అధికంగా వినియోగించడం వల్ల నేల సారం తగ్గిపోవడం, పర్యావరణ కాలుష్యం మరియు వ్యవసాయ వ్యయాలు పెరగడం వంటి నష్టాల గురించి రైతులకు అవగాహన కల్పించారు.
అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఎరువుల పంపిణీ విధానాలపై రైతులకు వివరించి, ఎరువుల పంపిణీ ప్రక్రియలో ఉపయోగిస్తున్నఏ పి ఏ ఐ ఎం ఎస్ 2.0 యాప్ యొక్క ప్రయోజనాలు, వినియోగ విధానం మరియు పారదర్శకత గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ఏ ఇ ఓ సుమంత్, రైతు సేవా కేంద్ర సిబ్బంది మరియు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. రైతులు భూమి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ శాస్త్రీయ పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ సూచించింది.



# మధ్యాహ్న భోజనం విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలి

**రేపల్లె జూన్2మనసులోమాట**

ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పరిశుభ్రంగా తయారుచేసి అందించాలని మండల విద్యాశాఖ అధికారి కే సురేష్ అన్నారు మంగళవారం స్థానిక ఆంధ్ర రత్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన తయారు చేసే వంటగాళ్ళు కు సహాయకులకు అవగాహన సదస్సును నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం Ajun మరియు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం తయారు చేసే వంటగాళ్ళు పరిశుభ్రమైన ఆహారం తయారుచేసి విలువలతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు కే రత్నాకర్ సి ఆర్పీలు పాల్గొన్నారు




# నేడు విజ్ఞాన్స్ వర్సిటీలో "గూగుల్ ఏఐ ల్యాబ్" ప్రారంభోత్సవం

**చేబ్రోలు జూన్ 2 (మనసులో మాట )::**

గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో, జెమిని ఎంటర్‌ప్రైజ్ ఫర్ ఎడ్యుకేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన "గూగుల్ ఏఐ ల్యాబ్" ను నేడు ప్రారంభిస్తున్నట్లు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ తెలిపారు.

గూగుల్ ఏఐ ల్యాబ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు. విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలు, పరిశోధనా సామర్థ్యాలు, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి, పరిశ్రమలతో అనుసంధానం పెంపొందించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

గూగుల్ ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించేందుకు గూగుల్ క్లౌడ్ పబ్లిక్ సెక్టార్ - ఎడ్‌టెక్ అండ్ మిడ్‌మార్కెట్ కంట్రీ డైరెక్టర్ ఆశిష్ వట్టల్, గూగుల్ క్లౌడ్ ఎడ్యుకేషన్-ఎడ్‌టెక్ ఇండియా హెడ్ వైభవ్ కుమార్, గూగుల్ క్లౌడ్ ఎడ్యుకేషన్ రీజినల్ హెడ్ నవిషా ప్రభాకర్, గూగుల్ క్లౌడ్ సొల్యూషన్ ఆర్కిటెక్ట్ ప్రతిక్షా ఆనంద్, గూగుల్ భాగస్వామ్య సంస్థ హెనోటిక్ గ్రూప్ సీఈవో బి. మల్లేశు తదితరులు హాజరుకానున్నారని తెలిపారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్స్, జనరేటివ్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులు ప్రత్యక్ష అనుభవాన్ని పొందేందుకు ఈ ల్యాబ్ ఎంతో ఉపయోగపడనుందని తెలిపారు. గూగుల్ ఏఐ ల్యాబ్ ద్వారా విద్యార్థులు అత్యాధునిక ఏఐ టూల్స్, గూగుల్ క్లౌడ్ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాలు, పరిశ్రమల్లో వినియోగిస్తున్న ఆధునిక పరిష్కారాలపై ప్రాయోగిక అవగాహన పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.ఈ ల్యాబ్ విద్యార్థులకు ఏఐ- డ్రివెన్ లెర్నింగ్ ద్వారా అత్యాధునిక సాంకేతిక సాధనాలను ప్రత్యక్షంగా ఉపయోగించే అవకాశాన్ని కల్పించనుంది. అలాగే రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు వాస్తవ జీవిత సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేసేలా ప్రోత్సహించనుంది. ఇండస్ట్రీ కొలాబరేషన్‌లో భాగంగా గూగుల్ క్లౌడ్ మరియు జెమిని సొల్యూషన్స్ సహకారంతో పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణ, ప్రాజెక్టులు, పరిశోధన అవకాశాలు లభించనున్నాయి. అదేవిధంగా ఫ్యూచర్ రెడీ స్కిల్స్ అభివృద్ధి ద్వారా కృత్రిమ మేధస్సు ఆధారిత భవిష్యత్ ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు సొంతం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.
విద్యార్థులను భవిష్యత్ సాంకేతిక సవాళ్లకు సిద్ధం చేయడంతో పాటు, పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించేందుకు ఈ గూగుల్ ఏఐ ల్యాబ్ ఒక కీలక వేదికగా నిలుస్తుందని వైస్ చాన్స్‌లర్ పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాల సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే స్థాయికి ఎదుగుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.
విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన మరియు ఆవిష్కరణ అవకాశాలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తోందని, గూగుల్ ఏఐ ల్యాబ్ ఆ దిశగా మరో మైలురాయిగా నిలుస్తుందని వైస్ చాన్స్‌లర్ తెలిపారు.



# మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు

**రాజుపాలెం, జూన్ 2 మనసులో మాట**

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు ప్రతి సంవత్సరం జూన్ 1వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు సందర్భంగా మంగళవారం మలేరియా వ్యతిరేక ప్రతిజ్ఞ, మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ కార్యక్రమంమము రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది చే రాజుపాలెం గ్రామ వీధుల్లో దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, చేతులు పరిశుభ్రముగా ఉంచుకోవాలని, పరిసరాలు పరిశుభ్రముగా ఉంచుకోవాలని స్లొగన్స్ తో ర్యాలీ నిర్వహించడం జరిగినది అని డాక్టర్ రవిపాల్ తెలియచేసినారు.జూన్ నుంచి వర్షాకాలం ప్రారంభమయ్యే ఈ సమయంలో దోమల పెరుగుదల ఎక్కువగా ఉంటాయి కనుక మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి కీటక జనిత వ్యాధుల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని డాక్టర్ రవి పాల్ తెలియచేసినారు.ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా నిర్మూలన సాధ్యమని, తరచుగా జ్వరం రావడం, తలనొప్పి, ఒళు నొప్పులు, అధిక చెమటలు, బలహీనత, నీరసం మలేరియా లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్షలు చేసికొవాలని తెలియచేసినారు. జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని అశా కార్యకర్తనుగాని ఆరోగ్య కార్యకర్తను సంప్రదించి రక్త పరీక్ష చేయించు కోవాలన్నారు. ప్రతి శుక్రవారం విధిగా ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు జీవన రావు, హెల్త్ విజిటర్ ఉషారాణి, హెల్త్ అసిస్టెంట్ షరీఫ్, ఎమ్.ఎల్.ఎచ్.పి., మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 12న టిడిపి విజయోత్సవ సభ--తూనుగుంట్ల సాయిబాబా



**భట్టిప్రోలు జూన్ 2 మనసులో మాట**

తెలుగుదేశం మరియు కూటమి ప్రజా ప్రభుత్వము ఏర్పడి రెండు సంవత్సరములు ప్రజా రంజక పరిపాలన పూర్తి అయిన సందర్భంగా ఈనెల 12 వ తేదీన విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి గం.630 లకు భట్టిప్రోలు శ్రీ వాసవి దేవస్థానం వద్ద " రెండు సంవత్సరాల విజయోత్సవ సభ " ఏర్పాటు చేయబడుతుందని ఆయన పేర్కొన్నారు.
కావున తెలుగుదేశం మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ తప్పక విచ్చేయ వలసిందిగా సాయిబాబా కోరారు
ఈ సమావేశ విషయాలు మన తోటి కార్యకర్తలకు కూడా తెలియచేసి,వారిని కూడా ఆహ్వానించ వలసినదిగా ఆయన తెలిపారు.

# కిల్కారి కాల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**నాదెండ్ల జూన్ 2 మనసులోమాట**



కేంద్ర ప్రభుత్వం గర్భిణీలు బాలింతలకు ప్రవేశపెట్టిన కిల్కారి కాల్ సేవలు సకరంగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆశ మోడల్ అధికారి సురేష్ అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కిల్కారి కాల్ సేవలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మాత శిశు మరణాలు తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం పెట్టింది అన్నారు. ఈ కిల్కారి కాల్ ద్వారా తల్లి మరియు బిడ్డల యొక్క ఆరోగ్య సమాచారం అందించబడుతుందన్నారు. ఈ కిల్కారి కాల్స్ గర్భిణి నాలుగవ నెల మొదలుకొని పుట్టిన బిడ్డ సంవత్సరం వరకు వర్తిస్తాయి అన్నారు. ఈ కిల్కారి వాయిస్ కాల్స్ నెలకు ఒకసారి గర్భిణి, బాలింతల యొక్క మొబైల్స్ కి వస్తాయి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్ నెంబర్ 911600403660 ఈ కాల్ నెంబర్ ని గర్భిణీలు మరియు బాలింతలు వారి మొబైల్ లో సేవ్ చేసుకున్నట్లయితే కాల్ వచ్చినప్పుడు వ్యక్తి పూర్తిగా సమాచారాన్ని వెన కలుగుతారన్నారు. ఒకవేళ మరల తిరిగి ఆ సమాచారాన్ని వినాలంటే 14423 అనే టోల్ ఫ్రీ నెంబర్ కు చేసి వినవచ్చు అన్నారు. ఈ సేవలను గర్భిణీలు బాలింతలు సక్రమంగా వినియోగించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ చంద్రశేఖర్, కిల్కారి పిఓ రాజు, సిహెచ్ఓ అమల, పీహెచ్ఎన్ ఎమ్మెల్యే హెచ్ పీ లు, ఏఎన్ఎంలు మరియు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మనసులో మాట

# లింగారావుపాలెం గ్రామంలో అంగన్ వాడీ పిలుస్తోంది కార్యక్రమం

**యడ్లపాడు జూన్ 02 మనసులో మాట**

మండల పరిధిలోని సొలస సెక్టార్ లింగారావు పాలెం గ్రామం లో సెక్టార్ సూపర్వైజర్ వి అరుణ సెక్టర్ మీటింగ్ నిర్వహించారు. సూపర్ వైజర్ అరుణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మెరకు ప్రతి గ్రామంలో అంగన్ వాడి పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించాలన్నారు. 3 +పిల్లలను అంగన్వాడీ కేంద్రం లో చేర్పించేందుకు ర్యాలీలు నిర్వహించాలని అన్నారు.అంగన్ వాడి కేంద్రాలలో ప్రైవేట్ కాన్వెంట్లకూ ధీటుగా ఆటపాటల ద్వారం విద్యను నిర్వహిస్తూ,పోష్ఠికాహారం అందిస్తుమని,కావున 3 నుండి 6 సంవత్సరాలపై పిల్లలందరిని అంగన్ వాడి కేంద్ర లో చేర్పించే విధంగా అంగన్వాడి కార్యకర్తలు తన పరిధిలోని గృహాలకు వెళ్ళి తల్లిదండ్రులకు కేంద్రంలో/ లభ్యమగు వసతులు గురించి వివరించి



పిల్లల హాజరు శాతం పెంచె విధం అంగన్ వాడీ కార్యకర్తలు నడుముకట్టి ర్యాలీలు, తల్లిదండ్రులతో సమావేశాలు, గృహ సందర్శనము చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సొలస సెక్టార్ లోని అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

**కిషోర్ వికాసం కార్యక్రమం**

అంగన్వాడి కేంద్రాల సమన్వయంతో కిశోరి వికాసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ వి అరుణ మాట్లాడుతూ కౌమార బాలికలకు సెల్ ఫోన్ సురక్షిత వినియోగం, సైబర్ భద్రత మరియు ఆన్‌లైన్ మోసాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. డిజిటల్ యుగంలో సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా బాలికలు ఎదుర్కొంటున్న ప్రమాదాలు, వాటిని నివారించే పద్ధతులపై అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యం.

**కిశోరులు పాటించాల్సిన ముఖ్యమైన ఆన్‌లైన్ భద్రతా సూత్రాలు:**

**1. సోషల్ మీడియా జాగ్రత్తలు:**



ప్రైవసీ సెట్టింగ్స్: ఫేస్బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి యాప్‌లలో ప్రైవసీని పటిష్టంగా ఉంచుకోవాలి. మీ ఫొటోలు, వ్యక్తిగత సమాచారం స్నేహితులకు మాత్రమే కనిపించేలా సెట్ చేసుకోవాలి. అపరిచిత వ్యక్తులు: తెలియని వారి నుండి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించకూడదు.

**2. వ్యక్తిగత సమాచారం**

ఫోన్ నంబర్, ఇంటి చిరునామా, ఆధార్ కార్డు లేదా బ్యాంక్ వివరాలను సోషల్ మీడియాలో ఎవరికీ చెప్పకూడదు.
వ్యక్తిగత ఫొటోలను గుర్తు తెలియని వ్యక్తులకు పంపడం, చాటింగ్ యాప్‌లలో షేర్ చేయడం అత్యంత ప్రమాదకరం.

**3. సైబర్ నేరాలు - మోసాలు:**

ఆన్‌లైన్ లో లాటరీలు, ఉద్యోగాలు, లేదా తక్కువ ధరకు వస్తువులు వస్తాయనే లింక్‌స్‌ను నమ్మి క్లిక్ చేయకూడదు.
ప్రేమ, ఆన్‌లైన్ స్నేహం పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

**4. పాస్‌వర్డ్ భద్రత:**

మీ మొబైల్ ఫోన్, ఈమెయిల్, సోషల్ మీడియా అకౌంట్‌లకు ఇతరులు ఊహించలేని విధంగా బలమైన పాస్‌వర్డ్‌లు (అక్షరాలు, సంఖ్యలు, గుర్తులు కలిపి) పెట్టుకోవాలి.
ఎవరితోనూ మీ పాస్‌వర్డ్‌లను షేర్ చేయకూడదు.

**5. సమస్యలు ఎదురైతే ఏమి చేయాలి?**

ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ మోసాలు ఎదురైతే భయపడకుండా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పెద్దలకు తెలియజేయాలి.
\ఎటువంటి ఆపద వచ్చినా వెంటనే 1930 (సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్) నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్, ఐ టి సి సిబ్బంది మేఘన, ప్రకాష్, అంగన్వాడీ టీచర్లు టీ పున్నమ్మ, బి అనురాధ, గ్రామ పెద్దలు నంబూరి శివరామ కృష్ణ, తోకల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక శాస్త్ర సిలబస్ హేతుబద్ధీకరణకు విజ్ఞప్తి

**భట్టిప్రోలు జూన్ 2 మనసులో మాట**

ఆంధ్రప్రదేశ్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ప్రతినిధులు కలిసి,సాంఘిక శాస్త్ర సిలబస్ హేతుబద్ధీకరణకు సంబంధించి విద్యాశాఖ కమిషనర్ అన్సారీ కి వినతిపత్రంను మంగళవారం అందించినట్లు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ తెలిపారు.అనంతరం మురళీమోహన్ మాట్లాడుతూ,పదో తరగతి సాంఘిక శాస్త్రంలో 22 పాఠాలు ఉండగా సైన్స్‌లో కేవలం 13 పాఠాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు.చరిత్ర, భూగోళ శాస్త్రం ,ఆర్థిక శాస్త్రం,రాజకీయ శాస్త్రం వంటి నాలుగు విభిన్న విభాగాలను ఒకే ఉపాధ్యాయుడు బోధించాల్సి రావడం వల్ల అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు సాంఘిక శాస్త్రంలో పాఠాల సంఖ్య ఇతర సబ్జెక్టులతో పోలిస్తే అధికంగా ఉందని, ఇటీవల సిలబస్ మార్పుల తర్వాత 6, 7,8 తరగతుల్లో కూడా పాఠాల సంఖ్య పెరగడం ఉపాధ్యాయులు, విద్యార్థులపై మరింత



ఒత్తిడిని సృష్టిస్తోందని వివరించారు. అధిక సిలబస్ కారణంగా లోతైన బోధన కంటే పాఠాలను పూర్తి చేయడానికే ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోందని, విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచన, పౌరస్పృహ, సామాజిక,అవగాహన పెంపొందించాలంటే పరిమితమైన, నాణ్యమైన సిలబస్ అవసరమని తెలిపారు. ఇతర సబ్జెక్టులకు అమలు చేసిన హేతుబద్ధీకరణ విధానాన్ని సాంఘిక శాస్త్రానికి కూడా వర్తింపజేసి,పాఠాల సంఖ్యను తగ్గించి ప్రధాన అంశాలను మాత్రమే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఫోరం కోరింది. ఈ సందర్భంగా కమిషనర్,ఫోరం ప్రతినిధులు వివరించిన సమస్యలను శ్రద్ధగా విని,అంశాన్ని సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్రం మురళీమోహన్ తెలిపారు. "సాంఘిక శాస్త్రానికి ప్రత్యేక ప్రాధాన్యం కాదు,ఇతర సబ్జెక్టులతో సమాన న్యాయం కావాలి. హేతుబద్ధీకరణలో సోషల్ స్టడీస్‌ను కూడా భాగస్వామ్యం చేయాలి" అని ఫోరం విజ్ఞప్తి చేసిందని గుర్రం మురళీమోహన్ తెలిపారు

# దూపిశెట్టి వారి నూతన వస్త్ర బహూకరణ వేడుక

**చిలకలూరిపేట జూన్ 2 మనసులో మాట**

స్థానిక పురుషోత్తమ పట్టణంలోని దూపిశెట్టి వారి గృహంలో నూతన వస్త్ర వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ శుభకార్యంలో జనసేన పార్టీ యువ నాయకులు, ప్రధాత మండలనేని చరణ్‌తేజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా వెంకట కృష్ణారావు నాగశివ పార్వతి దంపతుల కుమార్తె చిరంజీవి భోగ్యశ్రీని ఆయన చిలకలూరిపేట సమన్వయకర్త తోట రాజా రమేష్ తో కలిసి హృదయపూర్వక ఆశీస్సులు అందజేశారు.ఈ సందర్భంగా దూపిశెట్టి కుటుంబ సభ్యులు చరణ్‌తేజకు ఘన స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సత్కరించారు. జనసేన యువ నాయకుడి రాకతో సదరు కుటుంబంలోనూ, స్థానిక



పరిసర ప్రాంతాల్లోనూ పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో దూపిశెట్టి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఖ్యలో పాల్గొన్నారు.



# ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న సినిమా దర్శకుడు హను రాఘవపూడి!

**ఇంద్రకీలాద్రి జూన్ 2 (మనసులో మాట)**

రెబల్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా, వైవిధ్యభరిత చిత్రాల దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఫౌజీ'
ఈ రోజు మంగళవారం మధ్యాహ్నం చిత్ర దర్శకుడు హను రాఘవపూడి విజయవాడలోని ఇంద్రకీలాద్రి కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారిని ఆయన దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. రెబల్ స్టార్ ప్రభాస్ కథానాయకుడుగా నిర్మిస్తున్న ఫౌజి సినిమా 80 శాతం షూటింగ్ పూర్తిఅయినా సందర్భంగా దర్శకుడు హను రాఘవపూడి మీడియాతో మాట్లాడుతూ 'ఫౌజీ' చిత్రానికి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను పంచుకున్నారు. సినిమా షూటింగ్ ఇప్పటికే 80 శాతం పూర్తయిందని ఆయన స్పష్టం చేశారు. మిగిలిన భాగాన్ని కూడా త్వరగతిన పూర్తి చేసి, ప్రేక్షకులకు అందించడానికి చిత్ర యూనిట్ శ్రమిస్తోందని తెలిపారు.



## ఉప్పలపాటి బంగారయ్య చిత్రపటానికి నివాళులర్పించిన ప్రత్తిపాటి

**యడ్లపాడు జూన్ 2 మనసులో మాట**

యడ్లపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉప్పలపాటి శ్రీనివాస రావు తండ్రి బంగారయ్య ఇటీవల మరణించగా మాజీ మంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు వారింటికి వెళ్లి, చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శించరు. అనంతరం గ్రామానికి చెందిన కారుచోల శివ ప్రసాద్ ఇటీవల మరణించగా వారింటికి వెళ్లి, చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి వెంట మండల పార్టీ అధ్యక్షులు కామినేని సాయిబాబా, పోపూరి రాఘవయ్య, పోపూరి వెంకటరత్తయ్య, గోనుగుంట్ల శ్రీనివాసరావు, ఉప్పలపాటి సీతారామయ్య, పోపూరి నాగేశ్వరరావు, గ్రామ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



## వర్షా కాలంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలి...

**నిజాంపట్నం ,జూన్ 2, (మనసులో మాట):**

వానకాలం సీజన్ మొదలవుతున్నందు వల్ల నీటి నిల్వల వల్ల దోమల అభివృద్ధి చెంది అనేక రోగాలకు గురుచేస్తాయని కూచినపూడి ప్రాథమిక వైద్యశాల వైద్యులు డాక్టర్ నాగార్జున. డాక్టర్ వెంకట కిషోర్ అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా వైద్య అధికారులు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కూచినపూడి ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో మలేరియా మహోత్సవాలు జరుగుతాయని జూన్ నెలలో ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. వర్షాకాలం సీజన్ మొదలవడం వల్ల నీరు నిల్వ ఉన్న చోట దోమలు అభివృద్ధి చెంది దోమల వల్ల మలేరియ, డెంగ్యూ, చికెన్ గునియా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు వ్యాప్తి చెందుతాయని వైద్య అధికారులు తెలియజేశారు. వర్షాకాలం సీజన్లో జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్ష చేయించుకోవాలని ఏఎన్ఎం, సిహెచ్ఓ ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని అన్నారు. ఈ వర్షాకాల సీజన్లో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు తెలిపారు. అనంతరం కూచినపూడి ప్రాథమిక వైద్యశాల వైద్యులు సిబ్బందితో మలేరియా మహోత్సవ ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కూచినపూడి ప్రాథమిక వైద్యశాల సూపర్వైజర్ మురళి, కాసులు, పిహెచ్ఎన్ లక్ష్మి మరియు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# రూ 8,90,874 లు ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు

**భట్టిప్రోలు జూన్ 2 మనసులో మాట**

వేమూరు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొంది ఉన్నారు. వారి వైద్య ఖర్చులను దృష్టిలో ఉంచుకుని, బాధితుల దరఖాస్తులను వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు,మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు తమ సిఫార్సు లేఖలతో ముఖ్యమంత్రి సహాయ నిధి కార్యాలయానికి పంపించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ ఓ సి)రూపంలో మొత్తం 8 మంది లబ్ధిదారులకు రూ.8,90,874 లు వైద్య సహాయాన్ని మంజూరు చేశారు. మంజూరైన వారిలో పెరవలి గ్రామనకు జొన్నకూటి వెంకటేశ్వరరావు కు రూ 2,04,560లు, ఐలవరం గ్రామనకు చెందిన కొండ వెంకటరావు కు రూ 1,60,478 లు, వెల్లబాడు గ్రామ నివాసి మిరియంపల్లి లక్ష్మీ పద్మ కు రూ 50, 417లు చావలి గ్రామానికి చెందిన రావూరి బాల కోటేశ్వరమ్మ కు రూ 2,56,608లు, యడ్లపల్లి గ్రామ నివాసి



షేక్ గౌస్ బేగం హజ్మా కు రూ 49,319లు, కొల్లూరు గ్రామ నివాసి జన్ను మాధవి కి రూ 49,492లు, కొల్లూరు గ్రామంకు చెందిన ఆలూరి పిచమ్మ కు రూ 60, 000లు, బలిజేపల్లి గ్రామంకు చెందిన వెలగా వెంకటేశ్వర్లు కు రూ 60,000లు ఈ సందర్భంగా మాజీ మంత్రి, వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ,పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అవసరమైన వారికి ఆర్థిక తోడ్పాటును అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని,ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే ఆనంద బాబు తెలిపారు. మంజూరైన మొత్తాలను మంగళవారం లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేసి వారికి ధైర్యం చెప్పారు.

# కవిత వ్యాఖ్యలపై దళిత బహుజన హక్కుల పోరాట సమితి ఆగ్రహం

- **ఆంధ్రుల జోలికొస్తే సహించేది లేదు**
- **విగ్రహాలు పీకుతామనడం దుర్మార్గం**
- **డీబీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ హెచ్చరిక**

**నరసరావుపేట జూన్ 02 (మనసులో మాట)::**

లిక్కర్ స్కాంలో జైలుకెళ్లి వచ్చిన తెలంగాణ రాష్ట్ర సమితి నాయకురాలు కవిత, ఆంధ్రప్రదేశ్ ప్రజలనుద్దేశించి అవమానకరంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి (డి బి హెచ్ పి ఎస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ తీవ్రంగా హెచ్చరించారు. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం నల్లగార్లపాడులోని అంబేద్కర్ నగర్లో జరిగిన ఒక ముఖ్య సమాచార సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ఆంధ్రుల విగ్రహాలను పీకి పార్సిల్ చేస్తామంటూ కవిత చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వివాదాస్పద వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆంధ్రుల ఆగ్రహానికి గురికాక తప్పదని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో నాటి పరిస్థితులను ఈ సందర్భంగా రమేష్ కుమార్ గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయినప్పుడు కీలకమైన పరిశ్రమలు, ప్రభుత్వ ప్రధాన ఆదాయ వనరులన్నీ



తెలంగాణకే దక్కాయని పేర్కొన్నారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కట్టుబట్టలతో మిగిలి, తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుతం రాజధాని అమరావతి ప్రాంతం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. లిక్కర్ స్కాంలో అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించి, జైలు జీవితం అనుభవించి వచ్చిన కవితకు ఆంధ్రుల గురించి కానీ ఏపీ రాజధాని నిర్మాణం గురించి కానీ మాట్లాడే ఎలాంటి నైతిక అర్హత లేదని ఆయన మండిపడ్డారు.ఆంధ్రప్రదేశ్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలను తాము ఎల్లప్పుడూ తోబుట్టువుల్లా సోదర భావంతోనే చూసుకుంటున్నామని రమేష్ కుమార్ తెలిపారు. కానీ తెలంగాణలో స్థిరపడిన ఆంధ్రుల పట్ల కవిత లాంటి నాయకులు సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తూ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేలా మరోసారి ఆంధ్రులను విమర్శిస్తే సహించేది లేదని ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే తగిన బుద్ధి చెబుతామని డాక్టర్ గోదా రమేష్ కుమార్ హెచ్చరించారు.

# పొలంలో వ్యర్థాలను తగుల పెట్టరాదు

**కొల్లూరు జూన్ 02(మనసులో మాట):**

వ్యవసాయ భూములను కాలుష్యం, భూసారక్షిత నుండి రక్షించాలని మండల వ్యవసాయ అధికారి వాగోలు బుష్ తెలిపారు. మంగళవారం అనంతవరం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ మాట్లాడుతూ విచక్షణా రహితంగా పురుగు మందులు, కలుపు మందులు, ఎరువులను వాడటం వల్ల భూమి సారాన్ని కోల్పోతుందని అన్నారు. పంట వ్యర్థాలను తగుల పెట్టకుండా రోటోవేటార్ తో భూమిలో కలియదున్ని సూపర్ పాస్పేట్ వేసుకోవటం వల్ల వ్యర్థాలు కుళ్ళి భూమిలో కలిసిపోయి భూమికి బలాన్ని ఇస్తుంది అన్నారు. అలా కాకుండా భూమిని తగుల పెట్టడం వల్ల భూమిలో ఉన్న సూక్ష్మ జీవులు వేడికి చనిపోవటం జరుగుతుందన్నారు. అలానే నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని ఫారమ్ పాండ్స్ పొలంలో తీసుకున్న నీటిలో వ్యవసాయం చేయటం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భూసారాన్ని కాపాడు కోవడం కోసం కేంద్ర ఎరువులు, పశువుల ఎరువులు, వర్మీ కంపోస్ట్ వినియోగించాలన్నారు.



అలానే భూసార పరీక్షలు చేయించుకుని అవసరం వరకు మాత్రమే ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. పొలం ఉంటేనే పంట ఉంటుంది పంట ఉంటేనే ఆహారం ఉంటుంది కావున ప్రతి ఒక్కరు వ్యవసాయ భూములను కాపాడుకోవడంలో తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ వంశీ, అనంతవరం పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వర్ రెడ్డి, వీపీఏ అశోక్, రైతులు పాల్గొన్నారు.

మనసులోమాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

# జిల్లా పరిషత్ గుంటూరు పరిపాలనా అధికారుల సమీక్ష సమావేశం

**గుంటూరు జూన్ 2(మనసులో మాట )::**



జిల్లా పరిషత్ గుంటూరులో సీఈఓ జ్యోతి బసు , డిప్యూటీ సీఈఓ కృష్ణ అధ్యక్షతన పరిపాలనా అధికారుల (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ ) సమీక్ష సమావేశం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ పరిధిలోని వివిధ మండల పరిషత్ కార్యాలయాల పరిపాలనా వ్యవహారాలు, పెండింగ్ అంశాలు, ఆడిట్ అభ్యంతరాలు మరియు కోర్టు కేసులపై విస్తృతంగా చర్చించారు.

సమావేశంలో మండల పరిషత్‌లకు చెందిన అనేక పరిపాలనా గ్రాంట్లు, నిధులకు సంబంధించిన జమా ఖర్చుల వివరాలను సమగ్రంగా పరిశీలించారు. అలాగే పరిహానా (రికవరీ ) నివేదికలు, వార్షిక నివేదికలు, ఆడిట్ అంశాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

మండల పరిషత్‌లలో గతంలో పెండింగ్‌లో ఉన్న లోకల్ ఫండ్ మరియు AG ఆడిట్ అభ్యంతరాలను త్వరితగతిన పరిష్కరించి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మండల పరిషత్‌లలో కొనసాగుతున్న కోర్టు కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ, ప్రస్తుత పరిస్థితిని రింగ్ ఫైళ్ల రూపంలో సిద్ధంగా ఉంచాలని సూచించారు.

జిల్లా ప్రజా పరిషత్‌కు సంబంధించిన ఆస్తుల వివరాలు, వాటి సంరక్షణ, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశంలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణ ప్రతి అధికారికి ముఖ్య బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యనిర్వహణాధికారి (CEO) గారు మాట్లాడుతూ, పరిపాలనా అధికారులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, పెండింగ్ అంశాలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అన్ని రికార్డులను నిర్వహించి, పారదర్శక పరిపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. సమావేశంలో పాల్గొన్న అధికారులు తమ పరిధిలోని వివిధ అంశాలపై వివరాలను సమర్పించగా, వాటిపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు జారీ చేశారు. జిల్లా పరిషత్ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇలాంటి సమీక్ష సమావేశాలు ఉపయోగపడతాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ క్రిస్టినా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి అధికారి సమన్వయంతో పనిచేసి జిల్లా పరిషత్ ప్రతిష్ఠను మరింత పెంచాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

# లేబర్ గుర్తింపు కార్డులతో కార్మికులకు కొండంత అండ ఎమ్మెల్యే చదలవాడ

- **మల్లమ్మ సెంటర్ వద్ద 250 మంది సిమెంట్, భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డుల పంపిణీ**
- **ప్రతి కార్మికుడు విధిగా గుర్తింపు కార్డు పొందాలి-ఎమ్మెల్యే పిలుపు**

**నరసరావుపేట జూన్ 02 (మనసులో మాట)::**




రాష్ట్ర ప్రభుత్వం కార్మిక గుర్తింపు కార్డుల ద్వారా శ్రామిక వర్గానికి అనేక సంక్షేమ ఫలాలను అందిస్తోందని, అందువల్ల ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు పొందాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మల్లమ్మ సెంటర్ వద్ద సిమెంట్ మరియు భవన నిర్మాణ కార్మికులకు లేబర్ గుర్తింపు కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాదాపు 250 మంది కార్మికులకు కార్డులు అందజేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. లేబర్ గుర్తింపు కార్డు ఉన్న కార్మికులు ప్రభుత్వం నుంచి అనేక సంక్షేమ పథకాలను సులభంగా పొందవచ్చు అని, ఇందులో భాగంగా రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా, ప్రమాదం జరిగితే రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు ప్రమాద బీమా లభిస్తుందని తెలిపారు. వీటితో పాటు కార్మికుల పిల్లల విద్యాభ్యాసానికి స్కాలర్‌షిప్‌లు, వృద్ధాప్య పెన్షన్, ప్రసవ సహాయం, మరియు ఇంటి నిర్మాణానికి సబ్సిడీలు వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం 18.24 లక్షల మంది కార్మికులు నమోదై ఉండగా, వీరిలో దాదాపు 12.8 లక్షల మంది కార్మికులు ఇప్పటికే గుర్తింపు కార్డులు పొందారని, గత సంవత్సరం లేబర్ కార్డు ఉన్న కార్మికుల కోసం ప్రభుత్వం మొత్తంగా రూ.1,248 కోట్ల సంక్షేమ నిధులు విడుదల చేసిందని వివరించారు.ముఖ్యంగా సిమెంట్, భవన నిర్మాణ రంగాల్లో పని చేసే కార్మికులు నిత్యం ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తుంటారని, కాబట్టి వారందరూ తప్పనిసరిగా లేబర్ గుర్తింపు కార్డులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్డు ఉంటే ఆసుపత్రి చికిత్స, మందులు, ప్రమాదం జరిగినప్పుడు తక్షణం ఆర్థిక సహాయం అందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ షేక్ సుభాని, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాంబశివా రెడ్డి, కార్మిక సంఘం నాయకులు, మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# రేపల్లె నియోజకవర్గం లో వైస్సార్సీపీ విజయం కాయం

**రేపల్లె జూన్2మనసులోమాట**



రేపల్లె నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికల్లో విజయం సాధించిన ఖాయమని వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మోపిదేవిం శ్రీనివాసరావు స్పష్టం చేశారు మంగళవారం వైఎస్ఆర్సిపి క్యాంపు కార్యాలయంలో రాజోలు కి చెందిన గ్రామ పెద్దలు వైఎస్ఆర్సిపి పార్టీలో చేరిన మోపిదేవి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై ఉన్న అభిమానంతో గ్రామ పెద్దలు రావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి విజయానికి ప్రతి ఒక్కరు కంకణబద్ధులై పని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు డి ఏడుకొండల రెడ్డి. డి ముసలారెడ్డి స్వామి రెడ్డి టి శ్రీనివాసరెడ్డి పి శ్రీనివాసరెడ్డి ఎం శ్రీను ఎం సూరి తదితరులు పాల్గొన్నారు

# రైలు కింద పడి వృద్ధుడు మృతి

**వేమూరు జూన్ 02(మనసులో మాట):**



రైలు కింద పడి ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన వేమూరులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... వేమూరు రైల్వే స్టేషన్ పరిధిలోని నిమ్మతోటల వద్ద ఓ వృద్ధుడు రైలు కు ఎదురు గా రైలు పట్టాల పై నడుచుకుంటూ వెళ్లి రైలు కింద పడి మృతి చెందాడన్నారు. మృతదేహాని తెనాలి వైద్యశాలకు రైల్వే పోలీసులు తరలించారన్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడి ని సమాచారం తెలిస్తే రైల్వే జి ఆర్ పి పోలీసుల ఫోన్ నెంబర్ కు 9948517274 సమాచారం ఇవ్వాలని అన్నారు.



# రేపల్లె మున్సిపాలిటీలో ముమ్మరంగా ‘ఆపరేషన్ క్లీన్ స్వీప్’

- **డ్రైనేజీలను శుభ్రపరుస్తున్న మున్సిపల్ సిబ్బంది**

**రేపల్లె జూన్2మనసులోమాట**

రేపల్లె మున్సిపాలిటీ పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ‘ ఆపరేషన్ క్లీన్ స్వీప్’ కార్యక్రమం పట్టణంలో ముమ్మరంగా చేయిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సాంబశివ రావు తెలియజేశారు మంగళవారం పట్టణంలోని 13వ వార్డులు ప్రత్యేక కార్యక్రమంలో వార్డు మొత్తం శుభ్రపరిచారు డ్రైనేజీల లోని చెత్తను తొలగించారు మురుగునీరు సక్రమంగా పారుదల అయ్యేలా శుభ్రపరిచారు ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురపాలక సంఘంలోని ప్రజలు తమ గృహాల ఎదుట పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు డ్రైనేజీలలో వ్యర్థ పదార్థాలను తీరదని పారిశుధ్య సిబ్బంది వచ్చినప్పుడు తడి చెత్త పొడి వేరువేరుగా సిబ్బందికి అందించాలని తెలియజేశారు మురుగునీరు నిల్వ ఉండకుండా ఎవరికివారు తమ పరిసరాల్లో శుభ్రపరుచుకోవడం వల్ల దోమలను నివారించవచ్చునని తెలియజేశారు ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం 13వ వార్డులో భారీ వర్షపు నీటి కాలువల పూడికతీత పనులను మున్సిపల్ అధికారులు పర్యవేక్షిస్తు naaranaruఇందులో భాగంగా వార్డులోని అన్ని నివాస ప్రాంతాలు, ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ పారిశుధ్య పనుల్లో మున్సిపల్ కమిషనర్ గారు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గారు స్వయంగా పాల్గొని సిబ్బందికి తగిన సూచనలు చేశారు. వారితో పాటు స్థానిక శానిటేషన్ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు ఈ డ్రైవ్ లో చురుగ్గా పాల్గొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా, దోమల వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

మనసులో మాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా ఆర్యలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

# అగ్ని బాదిత పసుపు రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర లేదు

- 8న దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ ముట్టడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం



**తెనాలి జూన్02(మనసులో మాట)**

రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా గాని దుగ్గిరాల శుభమహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్ని బాధ్యత పసుపు రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు క్వింటాల్కు 7వేల రూపాయలు పరిహారం ఇప్పించటంలో ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా ఈనెల 8వ తేదీన దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ యార్డు ముట్టడికి మంగళవారం స్థానిక కొత్తపేట ఎన్జీవోస్ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి అధ్యక్షత జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పసుపు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జొన్న శివశంకరరావు మాట్లాడుతూ శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాదం జరిగినప్పుడు క్వింటాల్ పసుపు ధర 13400రూపాయిలు ఉందన్నారు. కానీ మంత్రి అచ్చం నాయుడుతో జరిగిన ఒప్పందంలో క్వింటాల్కు 7వేలు ఇప్పించాలని కోరినా గాని రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వం పసుపు రైతులకు సహాయం చేయడంలో అలసత్వం వహిస్తుందని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం దుగ్గిరాల తహసిల్దార్ కార్యాలయం వద్ద దీక్షలు సందర్భంగా వచ్చిన ప్రస్తుత కేంద్ర మంత్రి డాక్టర్ పెమసాని చంద్రశేఖర్ రాబోయే మూడు నెలలు ఆగండి తమ ప్రభుత్వం వస్తుంది అని పేర్కొన్నారని, రెండు సంవత్సరాల నాలుగు నెలలు గడుస్తున్నా గాని ఇంతవరకు పసుపు రైతులకు అరకొర డబ్బులు ఇవ్వటమే గాని పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వకపోవడంలో గల ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేంద్రమంత్రి కార్యాలయం నుండి 5వేలకు సంతకాలు పెట్టి భవిష్యత్తులో పసుపు రైతులు వారి వారసులు ఎటువంటి లావాదేవీలు జరపరాదని సంతకం పెట్టమని చెప్పటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తెచ్చిన మోడీ ప్రభుత్వం రైతుల ఉద్యమానికి తలవంచి పార్లమెంట్ లో క్షమాపణ చెప్పి బిల్లును ఉపసంహరించుకుందని గుర్తుచేశారు. పసుపు రైతులు ఆందోళన చేయకుండా ఏ ప్రభుత్వం రైతులకు న్యాయం చేయదన్నారు.ఈనెల 8వ తేదీన దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ యార్డు ముట్టడి 15వ తేదీన వ్యవసాయ శాఖ మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడుతూ శుభమహేశ్వరి కోల్డ్ స్టోరేజీ యజమాని నిర్లక్ష్యం కారణంగానే పసుపు పంట బూడిదగా మారిందని ఆయన ఆవేదన చెందారు. ఇప్పటికీ ప్రభుత్వ అధికారులు యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆయన ఆక్షేపించారు. అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖను ఒక్కసారి సీఎంఓ కార్యాలయం తెరచి చూడాలని ఆయన కోరారు. అప్పటి మార్కెట్ రేట్ ప్రకారం పసుపు డబ్బు చెల్లించాలని ఇన్సూరెన్స్ ఇవ్వాలని భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆ లేఖలో ముఖ్యమంత్రి తెలిపినట్లు ప్రసాద్ వివరించారు. ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించి వెంటనే పసుపు రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయవాది పట్టణ పరిసరాల అభివృద్ధి సంఘం అధ్యక్షులు దరిశి శివకోటేశ్వరావు మాట్లాడుతూ పోలీసులు ప్రభుత్వ యంత్రాంగం స్పందించి పసుపు రైతులను ఆదుకోవడంలో విఫలమైందని చెప్పారు.ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని పసుపు రైతులను ఆదుకోవాలని కోరారు. శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ అందరికీ శుభం చేకూర్చే పసుపు కోల్డ్ స్టోరేజీ బాధితులకు శుభం చేకూర్చలేదని తెలిపారు. శుభం మహేశ్వరి గోల్డ్ స్టోరేజ్ యజమాని తోపాటు ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ నిర్లక్ష్యం కారణంగానే పసుపు రైతులు రోడ్డున పడాల్సి వచ్చిందని ఆవేదన చెందారు. బాదిత పసుపు రైతుల సంఘం నాయకులు గద్దె శ్రీహరి మాట్లాడుతూ ఒక చిన్నారికి 16 కోట్ల రూపాయలు వైద్య సహాయం చేసిన మంత్రి లోకేష్ పసుపు రైతులకు 10 కోట్లు ఇప్పించలేరా ఆయన ప్రశ్నించారు. రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం ఎన్జీవో కళ్యాణమండపం నుండి సబ్ కలెక్టర్ ఆఫీస్ వరకు ప్రదర్శన నిర్వహించారు. వర్ధిల్లాలి పసుపు రైతుల ఐక్యత. కోల్డ్ స్టోరేజ్ యజమాని చట్ట ప్రకారం శిక్షించాలి అరెస్టు చేయాలి అనే నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి గుళ్ళపలి వెంకట సుబ్బారావు షేక్ హుస్సేన్ వలి, వెంకటప్ప రెడ్డి, ఎర్రి వెంకటేశ్వరరావు, భీమవరపు చిన్నరామిరెడ్డి, కళ్లం శ్రీనివాస్ రెడ్డి,రవి కిషోర్ లంకి రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, కోడూరు ఆంజనేయులు, రావెల రాజేష్, జి. నాగేశ్వరరావు,టి.వీర రాఘవులు ,బొల్లిమంత రామారావు, జొన్నల కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ నిర్వహణ అధికారి శ్రీధర్ కు వినతి పత్రం అందజేశారు.

## నేడు వెల్లటూరులో తెలుగుదేశం పార్టీ సమావేశం--రాజశేఖర్

**భట్టిప్రోలు జూన్ 2 మనసులో మాట**

భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో బుధవారం ఉదయం 10 గంటలకు పోలింగ్ బూత్ ఇన్చార్జిల సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లటూరు యూనిట్ ఇన్చార్జి కొల్లి రాజశేఖర్ మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్లటూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద పోలింగ్ బూత్ ఇంచార్జి ల సమావేశం జరుగునని,కావున వెల్లటూరు యూనిట్ లోని 229,230,231,232,233 పోలింగ్ బూత్ లకు సంబంధించిన ఇంచార్జ్ లు,సహా ఇంచార్జ్ లు ఉదయం 10 గంటలకు వెల్లటూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకోవాల్సిందిగ వెల్లటూరు యూనిట్ ఇంచార్జ్ కొల్లి రాజశేఖర్ తెలిపారు.






## త్రికోటేశ్వర స్వామి దర్శించుకున్న టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు టి డి జనార్దన్

**చిలకలూరిపేట జూన్ 2 మనసులో మాట**

ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ లో స్వయంభూ మూర్తిగా వెలిసిన శ్రీ త్రికోటేశ్వర స్వామి వారిని తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు డి టి జనార్ధన్ దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దాసరి చంద్రశేఖర రావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ప్రత్యేక అభిషేక కార్యక్రమాల పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఆయన వెంట పల్నాడు జిల్లా తెలుగు యువత నాయకులు నన్నపనేని టరిష్, జీడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు,దగ్గుమల్లి సాంబశివరావు, చుండి భరత్ పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాద స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వేటపాలెం పోలీస్ స్టేషన్‌కు వాటర్ కూలింగ్ రిఫ్రిజిరేటర్ బహుకరణ

**వేటపాలెం జూన్ 2 మనసులో మాట**

వేటపాలెం పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు వేసవి కాలంలో చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో బాపట్ల జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు, చీరాల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దోగిపర్తి బాలకృష్ణ వాటర్ కూలింగ్ రిఫ్రిజిరేటర్‌ను బహుకరించారు.

చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేటపాలెం స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి. జనార్ధన్ రిఫ్రిజిరేటర్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా సీనియర్ నాయకులు నాసిక వీరభద్రయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు జాగబత్తుని పోతురాజు, వైశ్య ఫెడరేషన్ సభ్యులు కొత్త శ్రీనివాసరావు, చుండూరు సురేష్, మాజేటి వెంకట సుబ్బారావు, గట్టా రమేష్, చుండూరు నాగాంజనేయులు, శేఖర్, గ్రామ ప్రజలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.

# మంగళవారం నుంచి హజ్ యాత్రికుల రాక ప్రారంభం

**మనసులో మాట న్యూస్ జూన్ 02**
**గుంటూరు**

హజ్ యాత్ర ముగించుకుని స్వదేశాలకు వచ్చిన హాజీలకు ఘన స్వాగతం పలికిన రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష



విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం ద్వారా పవిత్ర హజ్ యాత్రకు వెళ్లిన యాత్రికులు విజయవంతంగా యాత్రను ముగించుకుని తిరిగి స్వదేశానికి చేరుకుంటున్నట్లు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ హసన్ భాష తెలిపారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక విమానాల ద్వారా హజ్ యాత్రికులు విజయవాడ గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటున్నారని ఆయన గుంటూరు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.
ఈ సందర్భంగా హాజీ హసన్ భాష మాట్లాడుతూ పవిత్ర హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి వస్తున్న హాజీలకు రాష్ట్ర హజ్ కమిటీ తరఫున హృదయపూర్వక స్వాగతం పలికినట్లు తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి మొదటి దశలో ఏప్రిల్ 18, 19 తేదీల్లో బయలుదేరిన 333 మంది హజ్ యాత్రికులు తిరిగి మూడు ప్రత్యేక విమానాల ద్వారా స్వదేశానికి చేరుకుంటున్నారని వెల్లడించారు.
రోజుకు 111 మంది చొప్పున మంగళవారం, బుధవారం, గురువారం మూడు రోజుల వ్యవధిలో యాత్రికులు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని తెలిపారు. జూన్ 2న మధ్యాహ్నం 1.10 గంటలకు, జూన్ 3న మధ్యాహ్నం 1.00 గంటలకు, జూన్ 4న రాత్రి 11.20 గంటలకు ప్రత్యేక విమానాలు విజయవాడకు చేరుకుంటాయని పేర్కొన్నారు.
హజ్ యాత్రికుల రాక సందర్భంగా ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా విమానాశ్రయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. యాత్రికుల కుటుంబ సభ్యులు, బంధువులు విమానాల సమయాలను గమనించి స్వాగత కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఈ ఏడాది దాదాపు 2,000 మంది హజ్ యాత్రికులు పవిత్ర మక్కా, మదీనా నగరాలకు వెళ్లారని, వారందరూ సురక్షితంగా యాత్రను పూర్తి చేసుకుని తిరిగి రావడం ఆనందదాయకమని హాజీ హసన్ భాష అన్నారు. హజ్ యాత్రికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లి వచ్చిన ప్రతి యాత్రికుడికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వం మైనార్టీల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకున్న ప్రతి హాజీకి అభినందనలు తెలియజేస్తూ, వారి ప్రార్థనలు రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, సుభిక్షం తీసుకురావాలని ఆకాంక్షించారు.
హజ్ యాత్రికుల రాక సందర్భంగా రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు, జిల్లా హజ్ కమిటీ ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, స్వచ్ఛంద సేవకులు, యాత్రికుల కుటుంబ సభ్యులు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని వారికి ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి యాత్ర విజయవంతంగా పూర్తిచేసుకుని రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. హజ్ యాత్రికుల రాకతో వారి కుటుంబాల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. పవిత్ర హజ్ యాత్ర అనంతరం స్వదేశానికి చేరుకున్న హాజీలను బంధుమిత్రులు ఆప్యాయంగా ఆహ్వానించడంతో గన్నవరం విమానాశ్రయం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.
మౌలానా ముస్తాక్ అహ్మద్, మొహమ్మద్ షీబ్లి, హజ్ కమిటీ డైరక్టర్లు మౌలానా ఆబిద్ మన్సూర్ అలీ అహ్మద్ మాబు భాష, హజ్ కమిటీ సి ఈ ఓ గౌస్ పీరా పాల్గొని విజయవంతం చేశారని ఆయన చెప్పారు.
ఈ హజ్ యాత్రకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో పాటు రాష్ట్ర మైనార్టీ శాఖ, న్యాయశాఖ మంత్రి ఫరూక్, శాసనమండలి మాజీ చైర్మన్ ప్రభుత్వ సలహాదారుడు షరీఫ్ ప్రోత్సాహంతో ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని హాసన్ భాష ప్రకటించారు. సాగర్ రాజు, పార్వతయ్య, కుమారి చాంద్ బి , ఆఫీసు సిబ్బంది వీరనారాయణమ్మ, లలిత, ఐఇఆర్టి కె .హరికుమార్ తదితరులు పాల్గొన్నారు

# కలకలం సృష్టించిన వేణు ఉదంతం

**నాదెండ్ల జూన్ 2 మనసులోమాట**






బిటెక్ విద్యార్థి కిడ్నాప్ కు గురయ్యాడని మండలంలోని సోమవారం రాత్రి కలకలం సృష్టించగా కిడ్నాప్ కలకలం సృష్టించిన వ్యక్తి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురైన సంఘటన మండలంలోని కనపర్రు గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, కనపర్రు గ్రామానికి చెందిన వైసిపి చిలకలూరిపేట నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు గుంజి శ్రీనివాసరావు తమ్ముడు రవి కుమారుడు వేణు బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం వెతుక్కుంటున్నాడు. మండలంలోని సాతులూరు ఎస్సీ కాలనీకి చెందిన అమర్లపూడి సాగర్ డిగ్రీ వరకు చదివాడు, వేణు, సాగర్ గత నాలుగు సంవత్సరాల నుంచి స్నేహితులుగా కొనసాగుతున్నారు. వేణు అప్పుడప్పుడు సాగర్ వద్దకు వచ్చి వెళుతుంటాడు, సోమవారం కనపర్రు గ్రామం నుండి నరసరావుపేటలో వైసీపీ ఆధ్వర్యంలో డీఎస్సీకి వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్లి ర్యాలీ అనంతరం నరసరావుపేట నుండి సాతులూరు సాగర్ వద్దకు వచ్చాడు. రాత్రి 8 గంటల సమయంలో సాగర్, వేణు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాగానే ద్విచక్ర వాహనంపై నలుగురు వ్యక్తులు వచ్చి మేము పోలీసులము అని చెప్పి వేనుని బలవంతంగా ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని వెళ్లారు. వచ్చిన పోలీసులు పలానా పోలీస్ స్టేషన్ అని మేము కేసు మీద వచ్చామని చెప్పకుండా వేణుని తీసుకుని వెళ్లడంతో అందరూ కిడ్నాప్ గా భావించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వేణు ఫోను స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో కిడ్నాప్ కు కలకలం మరింత బలపడింది.కుటుంబ సభ్యులు రాత్రి 12 గంటల సమయంలో నాదెండ్ల పోలీస్ స్టేషన్లో వేణు ని కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటేశ్వరరావు ఫిర్యాదు నమోదు చేసి మంగళవారం మధ్యాహ్నం నాదెండ్ల పోలీస్ స్టేషన్ ట్రైన్ ఐపీఎస్ జాదారపు నిరంజన్ మహేందర్ సిన్హా, ఎస్సై వెంకటేశ్వరరావు సిబ్బందితో వేణు కుటుంబ సభ్యులను వెంటబెట్టుకుని వచ్చి ఎస్సీ కాలనీలో ఉన్న సాగర్ ఇంటి వద్ద సాగర్ ను సాగర్ కుటుంబ సభ్యులను విచారించారు. అనంతరం వేణు కుటుంబ సభ్యులు ట్రైనీ ఎస్పీ వెళ్లిన తర్వాత ఎస్సై వెంకటేశ్వరరావు సిబ్బంది గ్రామంలోనే సీసీ కెమెరాలు పరిశీలిద్దామని బయలుదేరగా మియాపూర్ పోలీస్ స్టేషన్ నుండి ఎస్ఐ వెంకటేశ్వరరావుకు ఫోన్ వచ్చింది. 742/2026 క్రైమ్ నెంబర్లు వేణుని కానిస్టేబులు అదుపులోకి తీసుకొని మియాపూర్ తీసుకువచ్చినట్టు తెలిపారు. ఈ సమాచారంతో వేణు కిడ్నాప్ కాలేదని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. హైదరాబాద్ షేర్ లింగంపల్లి మండలం మియాపూర్ వెంకటేశ్వర నగర్ కృష్ణారెడ్డి రెసిడెన్స్ లో ఫ్లాట్ నెంబర్ 101 లో ఏడాది మార్చి 23వ తేదీన టి రాజేష్ అనే వ్యక్తి తన బెడ్ రూమ్ లో కప్బోర్డ్ లో 20 లక్షలు పెట్టాడు. మే 14వ తేదీన కబోర్డ్ లో తెరిచి చూడగా 20 లక్షలు కనిపించలేదు, దీనిపై మియాపూర్ పోలీస్ స్టేషన్లో రాజేష్ ఫిర్యాదు చేయగా స్టేషన్ ఇన్స్పెక్టర్ గంట రమేష్ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వేణు హైదరాబాదులో కొద్దిరోజులు మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి ఒక రూమ్ లో ఉండటంతో వారిపై అనుమానం పెంచుకొని వారిని అదుపులోకి తీసుకోగా విచారించగా వేణు పేరు చెప్పినట్లు, వేణు ఫోను సిగ్నల్స్ ఆధారంగా లొకేషన్ గుర్తించి వేనుని అదుపులోకి తీసుకొని హైదరాబాద్ కు తరలించారు. కిడ్నాప్ కాదని తెలుసుకున్న పోలీసులు కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.సమాచారం అందక ముందు నాదెండ్ల పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదయింది.



# చీరాల పేరాల ఉద్యమకర్త దుగ్గిరాల ఆశయ సాధనకు కృషి చేద్దాం

**చీరాల జూన్ 2 ( మనసులో మాట)**

చీరాల పేరాల ఉద్యమ రూపకర్త దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ దేవరాజు అన్నారు. మంగళవారం దుగ్గిరాల గోపాలకృష్ణయ్య 137వ జయంతి సందర్భంగా విడుదల చేసిన ఒక ప్రకటనలో దుగ్గిరాల సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రముఖ స్వతంత్ర సమరయోధులు , శ్రీరామ దండు వ్యవస్థాపకులు, సహాయ నిరాకరణ ఉద్యమ స్ఫూర్తిదాత శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణ ఆశయ సాధనకు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శ్రీ వివేకానంద సేవా సమితి వ్యవస్థాపకులు సర్విశెట్టి సుబ్బరామయ్య, బిజెపి జిల్లా నాయకులు కోట్ర వెంకట రామకృష్ణ, వరపర్ల అరుణ్ తో కలిసి దుగ్గిరాల గోపాలకృష్ణ స్మారక మందిరము, గ్రంథాలయం, శ్రీ కోదండ రామాలయం నిర్మించుటకు స్థల సేకరణ కోసం ఆర్టీసీ గ్యారేజ్ దగ్గర ఉన్నటువంటి దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వినియోగించినటువంటి బావి మరియు గోపాల కృష్ణయ్య కి సంబంధించిన 2 ఎకరాల స్థల నిర్ధారణ కోసం ప్రభుత్వ సర్వేయర్ తో కలిసి పరిశీలించడం జరిగినది.
అన్ని పార్టీలను కలుపుకొని దుగ్గిరాల గోపాలకృష్ణ స్మార్త మందిరం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. చీరాల పేరాల ఉద్యమం ద్వారా చారిత్రాత్మక గుర్తింపుని తెచ్చిన గోపాలకృష్ణ సేవలను చీరాల పేరాల ప్రజలు స్మరించుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

**తెనాలి జూన్02(మనసులో మాట)**

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఐక్య వేదిక సభ్యులు కోరారు.మంగళవారం స్థానిక బాలాజీ రావు పేట లోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఐక్య వేదిక కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా దళిత క్రైస్తవుల కు ఎస్సీ హోదా కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిటీ కి ఐక్యవేదిక ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులు పడుతున్నటువంటి సాధక బాధలను వివరిస్తూ జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కు ఈ మెయిల్ ద్వారా ప్రతి ఒక్కరు దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని మెయిల్ పంపించాలని ఐక్యవేదిక సభ్యులు కోరారు.ఈసమావేశం లో హైకోర్టు న్యాయవాది పెరికల డానియల్,జై భీమ్ ఫెడరేషన్ అధ్యక్షులు కట్టివరపు దేవానంద్, దళిత నాయకులు ఒంపుగాని గురవయ్య, న్యాయవాది పిల్లి ప్రేమ రాజ్,పి.రాజకుమార్, పరస రాజు,గోల సందీప్, ఫేక్ దుబాయ్ బాబు, కుర్రా యశ్వంత్ యాదవ్ పాల్గొన్నారు. ఐక్యవేదిక అధ్యక్షులు అకిదాసు కిరణ్ కుమార్ పర్యవేక్షణలో సమావేశం నిర్వహించారు.



# రోడ్డు పక్కన వ్యక్తి అనుమానాస్పద మృతి: కేసు నమోదు

**చిలకలూరిపేట రూరల్ జూన్ 2 మనసులో మాట**

చిలకలూరిపేట రూరల్: మండలం పరిధిలోని పసుమర్రు గ్రామానికి చెందిన షేక్ జాకీర్ హుస్సేన్ (46, తండ్రి: ఆలీ సాహెబ్) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణంలో టింకరింగ్ పని చేసుకునే ఆయన, ఈ నెల 1వ తేదీ ఉదయం పనికి వెళ్లి రాత్రికి ఇంటికి తిరిగి రాలేదు. కాగా, మంగళవారం (జూన్ 2) ఉదయం వేలూరు నుండి జాలాది వైపు వెళ్లే రోడ్డు పక్కన జాకీర్ హుస్సేన్ గాయాలతో శవమై కనిపించాడు. తన భర్త మరణంపై అనుమానం ఉందని మృతుడి భార్య షేక్ సఫియా ఫిర్యాదు చేయడంతో, చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# టీడీపీ "యూనిట్" సమావేశాలు విజయవంతం చేయాలి

- **ప్రభుత్వ చీఫ్ విప్ జివి ఆంజనేయులు**

**వినుకొండ,మే 2( మనసులో మాట)**



తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని యూనిట్లలో బుధవారం తప్పనిసరిగా 'క్యాలెండర్ మీటింగ్స్' నిర్వహించాలని వినుకొండ శాసనసభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ఆదేశించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మొత్తం 85 యూనిట్లలో ఈ సమావేశాలు వంద శాతం జరగాలని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

ఈ సమావేశాల నిర్వహణకు ఆయా యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, కోఇన్‌ఛార్జ్‌లు పూర్తి బాధ్యత వహించాలని జీవి ఆంజనేయులు సూచించారు. బూత్ కన్వీనర్స్, కోకన్వీనర్స్, గ్రామ పార్టీ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, నీటి సంఘాల అధ్యక్షులు, ఆలయ కమిటీల సభ్యులు మరియు సీనియర్ నాయకులందరినీ కలుపుకుని సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రగతితో పాటు ఓటర్ల జాబితాలో జరుగుతున్న మార్పులు, చేర్పులపై క్షేత్రస్థాయిలో సమీక్షించాలన్నారు. అలాగే స్థానిక కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై సవివరంగా చర్చించి, యూనిట్ పరిధిలో పరిష్కారం కాని అంశాలను ప్రతి నెల రెండవ బుధవారం జరిగే మండల స్థాయి సమావేశం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. నాయకులందరి సమన్వయం కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలని, సమావేశ వివరాలతో పాటు ఫోటోలను తప్పనిసరిగా మై టీడీపి యాప్ లో అప్‌లోడ్ చేయాలని జీవి ఆంజనేయులు స్పష్టం చేశారు.

# మార్కాపురం రోడ్డులో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం..

**వినుకొండ, మే 2 (మనసులో మాట)**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ఆదేశాల మేరకు, పురపాలక సంఘం స్పెషల్ ఆఫీసర్ డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి సూచనలతో మున్సిపల్ కమిషనర్ కోడూరు శివరాం ప్రసాద్ ఆధ్వర్యంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నాలుగు వారాల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా, రెండో వారం స్థానిక మార్కాపురం రోడ్డు నందు మేజర్ డ్రైన్ డీసిల్టేషన్ (కాలువల పూడికతీత) పనులను వేగవంతం చేశారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు కాలువలపై ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించి, ఎటువంటి అడ్డంకులు లేకుండా పారిశుధ్య కార్మికులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా తోపుడుబండ్ల వ్యాపారులు సైతం చెత్త నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, వ్యర్థాలను కాలువల్లో వేయకూడదని సూచించారు. ప్రజలందరూ పారిశుధ్య నిర్వహణపై బాధ్యతగా వ్యవహరిస్తూ.. ఇళ్ల నుండి వచ్చే చెత్తను కాలువల్లో, రోడ్లపై లేదా ఖాళీ ప్రదేశాల్లో పడేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలని పిలుపునిచ్చారు.

అదేవిధంగా, పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ (ఏకకాల వినియోగ) ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, దీనిపై ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పారిశుధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్, ఏఐ ఎల్ జి ఎస్ జిల్లా కోఆర్డినేటర్ శివ పార్వతి,శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులు స్థానిక కాలనీ ప్రజలు చురుగ్గా పాల్గొన్నారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు" పోస్టర్, బుక్‌లెట్ ఆవిష్కరణ

- **పోస్టర్ ను అవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు**

**వినుకొండ,మే 2 (మనసులో మాట)**



పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ , బుక్‌లెట్‌ను మంగళవారం పార్టీ నాయకులు ఆవిష్కరించారు. వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు, జూన్ 4 నుంచి 12వ తేదీ వరకు వినుకొండ నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే రెండేళ్ల కాలంలో వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.ఇంటింటికీ బాండ్ల రూపంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, వాటిలో ఏ ఒక్క ముఖ్యమైన హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఆడబిడ్డ నిధి పేరుతో ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని చెప్పిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని పేర్కొన్నారు.అలాగే నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అందిస్తామని ప్రకటించిన చంద్రబాబు ప్రభుత్వం, ఆ హామీని కూడా విస్మరించిందని విమర్శించారు. కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని చెప్పినా, ఇప్పటివరకు అర్హులైన వారికి కొత్త పెన్షన్లు అందలేదని అన్నారు.వాలంటీర్ వ్యవస్థను కొనసాగించి మరింత బలోపేతం చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వ్యవస్థనే నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏలు పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు ఒక్క డీఏ కూడా అమలు చేయలేదని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, వినుకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారుమాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పై తాత్కాలికంగా కేసులు పెట్టి ఇబ్బంది పెట్టొచ్చు... కానీ సత్యాన్ని అణచివేయలేరు. కార్యకర్తలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు..ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుంటూరు నగరాన్ని సందర్శించిన యూనిడో ప్రతినిధులు






- అభివృద్ధి, పారిశుద్ధ్యం, వినూత్న కార్యక్రమాల పరిశీలన

**గుంటూరు, జూన్ 2(మనసులో మాట) :**

గుంటూరులో పారిశుధ్య, పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలను, సుస్థిర పట్టణాభివృద్ధి, ప్రజారోగ్య పరిరక్షణ, ఆధునిక పారిశుధ్య నిర్వహణలో గుంటూరు నగరపాలక సంస్థ అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలను యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (యూనిడో) ప్రతినిధులు, రాష్ట్రంలోని వివిధ నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీల కమిషనర్ల బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ బృందానికి నగరంలో యూనిడో సహకారంతో అమలు చేస్తున్న పలు వినూత్న కార్యక్రమాల గురించి, ముఖ్యంగా ప్రజారోగ్య పరిరక్షణ, పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు ఈఆటోల వినియోగం, వాటి ద్వారా చెత్త సేకరణ, శుభ్రత కార్యక్రమాల నిర్వహణ, పర్యావరణ హిత సాంకేతికతలకు ప్రాధాన్యత ఇస్తూ రిజర్వాయర్ల వద్ద ఈఆటోలకు అవసరమైన ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసిన విధానాన్ని వివరించారు. అనంతరం బృందం ఐపీడీ కాలనీలో డోర్ టు డోర్ చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించింది. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానం, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు, చెత్త నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న తీరును అధికారులు వివరించారు. ఎన్‌ఎస్‌కేఎఫ్డీసీ సహకారంతో ర్యాగ్ పికర్స్ కి అందించిన వాహనాలను పరిశీలించి, వారితో మాట్లాడారు. తదుపరి సంగం జాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ పనితీరును పరిశీలించారు.

## పోలీసు సిబ్బందికి సన్ గ్లాసెస్ అందజేసిన ప్రత్తిపాటి



**చిలకలూరిపేట జూన్ 02 మనసులో మాట**

పట్టణంలోని శ్రీ శంకర్ నేత్రాలయం వారి ఆధ్వర్యంలో చిలకలూరిపేట పరిధిలోని రూరల్ మరియు టౌన్ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న వివిధ హోదాలలో పోలీస్ అధికారులకు ఉచితంగా కూలింగ్ కళ్ళద్దాలను మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్ లో అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ వేసవి కాలంలో పోలీస్ అధికారులు బయట ఎండలకు పని చేస్తూ ఉంటారు అలాంటి వారికి విలువైన ఉచితంగా కూలింగ్ కళ్ళద్దాలు అందించాలి అన్న ఆలోచన రావటం సంతోషకరమని వారిని అభినందించారు. వేసవిలో ఎండదెబ్బ తగలకుండా అందరూ జాగ్రత్తగా ఉండాలని ప్రత్తిపాటి తెలిపారు. అందరూ ప్రజా సేవలో తమవంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ శంకర కంటి వైద్యులు నడమానూరి శివరామకృష్ణ (డి.వో.ఏ), పట్టణ, రూరల్ సీఐలు రమేష్, సుబ్బానాయుడు, వివిధ హోదాలలో ఉన్న టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక భద్రతతోనే మహిళల జీవితాల్లో వెలుగులు : ప్రత్తిపాటి

- సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగిపోతేనే వేగవంతమైన అభివృద్ధి
- సామాజిక సేవా సంస్థలు, సంపన్నులు ప్రభుత్వ ఆశయంలో భాగం కావాలి.
- పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసిన ప్రత్తిపాటి.





**చిలకలూరిపేట జూన్ 02 మనసులో మాట**

రెక్కల కష్టం, శక్తియుక్తులతో జీవించే పేద, మధ్య తరగతి మహిళల జీవితాలు మెరుగుపడి, ఆర్థిక భద్రత లభిస్తేనే, సమాజానికి మేలు జరుగుతుందని, ఆ దిశగా స్వచ్ఛంద సంస్థలతో పాటు.. కార్పొరేట్ సంస్థలు తమ సహాయ సహకారాలు అందించాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు.
మంగళవారం ఆయన పట్టణ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో జి.డి.యం.సి. చైర్మన్ వడ్డణం హరిబాబు తో కలిసి పాల్గొని, 20 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రోటరీ క్లబ్ నిర్వాహకుల సేవల్ని కొనియాడారు.
కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కందిమల్ల జయమ్మ, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మండల పార్టీ అధ్యక్షులు కామినేని సాయిబాబు, రోటరీ క్లబ్ సభ్యులు ఉప్పుటూరి ప్రసాద్, బోడే రామసుబ్బారావు, చిలుకూరి శ్రీనివాసరావు, కాంతయ్య, అడుసుమల్లి మోహన్ రావు, సాంబశివరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తెనాలి పట్టణంలో పర్యటించిన స్వచ్ఛభారత్ మిషన్ ప్రతినిధులు

**తెనాలి జూన్02(మనసులో మాట)**




స్వచ్ఛభారత్ మిషన్ ప్రతినిధులు ఢిల్లీ నుండి తెనాలి పురపాలక సంఘానికి మంగళవారం విచ్చేశారు.స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ సురభి మాలిక్, కన్సల్టెంట్ మనోజ్ కుమార్,ఎన్.పి.ఎం. యు.దీపక్ గోయల్ తదితరులు మున్సిపల్ కమిషనర్ రామా అప్పలనాయుడు,ఇతర అధికారులతో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. సుల్తానబాదులోని శివం అపార్ట్మెంట్ వద్ద చేస్తున్న హోం కంపోస్ట్ ను,పురపాలక సంఘం నిర్వహిస్తున్న త్రిబుల్ ఆర్ సెంటర్ ను, కంపోస్టు యార్డులో జరుగుతున్న వర్మీ కంపోస్ట్,ఆన్ సైట్ కంపోస్ట్,ఎస్.టి.పి. ప్లాంట్ వంటివి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ జాస్తి రామారావు, ఆరోగ్య శాఖాధికారి మొవ్వ ఏసుబాబు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, సానిటరీ సెక్రటరీలు సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి గోపాలకృష్ణ



**తెనాలి జూన్02(మనసులో మాట)**

మండలం లోని నందివెలుగు గ్రామం స్వర్ణ గ్రామ సచివాలయాన్ని మంగళవారం ప్రత్యేక అధికారి,మండల తహసీల్దార్ కే.వి. గోపాలకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా గోపాలకృష్ణ రికార్డుల నిర్వహణ,ప్రజలతో వ్యవహరించే విధానం, సేవల అందజేయటంలో మరింత మెరుగుదలపై సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.

## ప్రభుత్వ వసతిగృహాలలో దోమలమందు పిచికారీ

**తెనాలి జూన్02(మనసులో మాట)**



గుంటూరుజిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం ఆదేశాల మేరకు మలేరియా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో గల వివిధ ప్రభుత్వ వసతి గృహాలలో దోమల నివారణకై ముందు జాగ్రత్త చర్యగా ఆల్ఫా సైపర్ మిత్రిన్ మందును పిచికారీ చేయించడం జరిగిందని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, యుయల్ బి ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహాలకు సెలవులు కనుక ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే లోపల ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో సంబంధిత హాస్టల్ వార్డెన్లు, మలేరియా పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు,దాసరి శివనాగ మల్లేశ్వర రావు, ఆరోగ్య కార్యకర్తలు ఆలా వేణుగోపాల్,షేక్ నవీద్, సంకా శరత్ బాబు,దీపాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మాచర్లలో తట్ట మట్టి తీయలేదు కానీ.. ఆర్భాటాలకే పరిమితం



**మాచర్ల.2 జూన్ (మనసులో మాట)**

మాచర్ల పరిధిలోని జమ్మలమడక రోడ్డు చంద్రవంక వంతెన వద్ద నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జూలకంటి ప్రారంభించారు. వాగు పూడికతీత పనులు ప్రారంభించి పనులు ప్రారంభించి, అధికారులతో వంద రోజులు యాక్షన్ ప్లాను పై సుదీర్ఘంగా చర్చించారు. అయితే వందరోజుల యాక్షన్ ప్లాను అంటూ ఆర్భాటంగా ప్రారంభించినప్పటికీ, క్షేత్ర స్థాయిలో కనీసం ఒక తట్టమట్టి కూడా పక్కన వెయ్యకపోవడం పై విమర్శలు వ్యక్త అవుతున్నాయి.

# కండ్లకుంటలో ఉద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి

**కారంపూడి, జూన్ 2, ( పల్నాడు జిల్లా ) మనసులో మాట :-**



వెల్దుర్తి మండలం కండ్లకుంట గ్రామంలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనటానికి వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు కృష్ణదేవరాయలకు మండలంలో వ్యవసాయ బోరు బావులు ఎక్కువగా ఉండి ఇప్పుడు ఉన్న విద్యుత్ ఉప కేంద్రాలపై అధిక భారం పడి మండల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా తమకు ఇంకొక రెండు 33/11 కెవి ఉప కేంద్రాలు కావాలని వినతి పత్రాన్ని అందజేసిన గాడిపర్తి రమాదేవి పూర్ణయ్య, జాస్తి గంగారావులు, చప్పిడి రవితేజ, గుండాల హేమ సుందర్.వారు విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్, ఎంపీ కృష్ణదేవరాయులకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కారంపూడి మండలంలో ప్రస్తుతం ఉన్న మూడు 33/11 కెవి ఉప కేంద్రాలపై అధిక లోడుపడి తరచుగా ఎక్కువగా అంతరాయం ఏర్పడి రైతులకు, విద్యుత్ గృహ వినియోగదారులకు గంటల కొద్ది అంతరాయాలు ఏర్పడుతూ నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హెచ్ వి డి ఎస్ పథకం ద్వారా సరియైన అవగాహన లేకుండా కారంపూడి మండలంలో వందలకొద్దీ ట్రాన్స్ఫార్మర్లు పెట్టి, వేల కిలోమీటర్ల కొద్దీ ఎల్ టి లైన్లను లెవెన్ కె.వి లైన్లుగా మార్చి మూడు విద్యుత్ ఉప కేంద్రాలపై అధిక లోడు భారాన్ని వేసి సబ్ స్టేషన్లు తరచుగా మరమ్మత్తులకు లోన అయ్యేవిధంగా తయారు చేశారని వినియోగదారులు విమర్శలు చేస్తున్న తరుణంలో, మా గ్రామాలలో వ్యవసాయ బోరులు బావులు అధికంగా ఉన్నందున వేపకం పల్లి రోడ్డు వద్ద ఒక 33/11 కెవి ఉపకేంద్రం కావాలని మరియు కారంపూడి మండలంలో అన్ని గ్రామాల కంటే కూడా సన్నగండ్ల గ్రామంలో కేవలం బోరు బావులు పైన మాత్రమే వ్యవసాయం ఆధారపడి ఉండి, గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలకు మాకు 33/11 కె వి ఉప కేంద్రం కావాలని విన్నపాలు చేయగా చేయగా, గత ప్రభుత్వ హయాంలో కారంపూడి నుండి నరసరావుపేట వెళ్లే రహదారిలో గల నాగార్జునసాగర్ కుడి కాలువ వద్ద స్థల పరిశీలన కూడా చేసిన అప్పటి శాసనసభ్యులు అప్పటి ప్రభుత్వ సమయంలో ఆదిపత్య పోరులో,కొట్లాటలో భాగంగా కొంతమంది వ్యక్తులు మా సన్నిగండ్ల గ్రామానికి విద్యుత్ ఉపకేంద్రం రాకుండా చేశారని, ఇప్పటికైనా మాకు ఒక విద్యుత్ ఉప కేంద్రాన్ని నెలకొల్ప వలసినదిగా కోరుతున్నట్లు కారంపూడి మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు గాడిపర్తి రమాదేవి పూర్ణయ్య, మాజీ ఎంపీపీ జాస్తి గంగారావు, చప్పిడి రవితేజ, గుండాల హేమ సుందర్ లు ఇచ్చిన వినతి పత్రాన్ని ఇద్దరు నాయకులు పరిశీలించి, అవసరమున్న చోట్ల విద్యుత్ ఉపకేంద్రాలు తప్పకుండా ఏర్పాటు కు చర్యలు తీసుకుంటామని తెలియజేసినట్లుగా వారు చెప్పారు.

# ఐలవరంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు





**భట్టిప్రోలు జూన్ 2 మనసులో మాట**

జ్యేష్ఠ బహుళ విదియ మూలా నక్షత్ర యుక్త పూజా కార్యక్రమాలు భజన సంకీర్తనలు హనుమాన్ చాలీసా పారాయణులు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి మాట్లాడుతూ ఈ రోజు ఆంజనేయ స్వామి పూజించటం వల్ల కుజ గ్రహ దోష నివారణ జరిగి శుభం కలుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు బట్టువీరాఘవయ్య కొసనం భాస్కర వెంకటరమణ మాచర్ల రంగారావు కౌతరపు సుబ్రహ్మణ్య ప్రసాద్ వామనపల్లి కోటేశ్వరరావు పణితపు నాలుగు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్ర గాంధీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యకు ఘన నివాళి

**బాపట్ల జూన్ 2 మనసులో మాట:**



చీరాలపేరాల ఉద్యమం ద్వారా ఈ ప్రాంతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి "ఆంధ్ర గాంధీ"గా ఖ్యాతి గడించిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య దేశంలోనే తొలి సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా ఎంపికైన తొలి ఆంధ్రుడిగా ఆయన చరిత్రలో నిలిచారు. రామదండును స్థాపించి ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని పెంపొందించడంలో విశేష కృషి చేశారు. చీరాలపేరాల ఉద్యమంలో ప్రజలను 11 నెలలపాటు ఏకతాటిపై నడిపించి తన నాయకత్వ ప్రతిభను చాటుకున్నారు.ఆయన చేసిన త్యాగాలు, సేవలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు.

# వేలూరు రహదారిపై గాయాలతో వ్యక్తి మృతదేహం లభ్యం

**చిలకలూరిపేట రూరల్ జూన్ 2 మనసులో మాట**



చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామంలో వేలూరు గ్రామం నుండి జాలాది వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఒక వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని స్థానిక గ్రామస్తులు గమనించారు. రోడ్డుపై మృతదేహం ఉండటంతో భయాందోళనకు గురైన స్థానికులు, వెంటనే చిలకలూరిపేట రూరల్ పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుడి శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలు ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. దీంతో ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా (హత్య జరిగి ఉండవచ్చనే కోణంలో) పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# ఫోన్‌లకు బానిసలు కావద్దు.. బాల్య వివాహాలతో జీవితాలు పాడుచేసుకోవద్దు

**నరసరావుపేట జూన్ 02 (మనసులో మాట)::**




నరసరావుపేట పట్టణంలోని శ్రీనివాసనగర్ వాటర్ ట్యాంక్ వద్ద 'కిశోరి వికాసం' కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలబాలికలతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రత్యేక థీమ్‌గా "స్మార్ట్‌ఫోన్ వినియోగం" అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జోజిమ్మ మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్‌లు కేవలం విద్య,ఆధ్యాత్మిక మరియు అవసరమైన సాంకేతిక విషయాలను తెలుసుకోవడానికి మాత్రమే ఉపయోగించాలని సూచించారు. మిగతా అనవసరమైన విషయాలకు, వ్యసనాలకు దూరంగా ఉంటూ స్మార్ట్‌ఫోన్‌ను పరిమితంగా, బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని పిల్లలకు స్పష్టం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ఈశ్వరి దేవి, గోవిందమ్మ, శ్రీలక్ష్మి మరియు స్థానిక బాలబాలికలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్న వయస్సులోనే పెళ్ళిళ్ళు చేయడం వల్ల శారీరకంగా,మానసికంగా ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు పిల్లలు మానసికంగా సన్నద్ధం కావాలని, బాల్యవిభాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మనసులో మాట
KANCHARLA

# నరసరావుపేటలో ఆధ్యాత్మిక వైభవం..

## నేడు పట్టణానికి 'చిన్మయ అమృత వాహిని-2026' రథయాత్ర!

- జూన్ 3 (బుధవారం) సాయంత్రం 4:00 గంటలకు నరసరావుపేటకు రాక
- భారీ బైక్ ర్యాలీ, గుర్రపు రథం, 500 మంది మహిళల కోలాటాలతో శోభాయాత్ర
- చిన్మయారణ్యం (త్రికూట) ఆశ్రమంలో పాదుకా పూజ, స్వామీజీల అనుగ్రహ భాషణం
- భక్తుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం, మహాప్రసాద వితరణ



**నరసరావుపేట జూన్ 02 (మనసులో మాట):**

చిన్మయ మిషన్ అమృతోత్సవాలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా సాగుతున్న ప్రతిష్టాత్మక "చిన్మయ అమృత వాహిని2026" రథయాత్ర జూన్ 3 (బుధవారం) నాడు అనగా నేడు సాయంత్రం 4:00 గంటలకు నరసరావుపేట పట్టణానికి చేరుకుంటారు. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో 295 రోజుల పాటు విస్తృతంగా పర్యటించి, దాదాపు 35,000 కిలోమీటర్ల లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని నరసరావుపేట ప్రాంతంలోకి ప్రవేశిస్తున్న ఈ రథయాత్రకు మరియు విచ్చేస్తున్న పూజ్య గురుదేవులు చిన్మయానంద మహారాజ్ స్వామీజీలకు ఘన స్వాగతం పలికేందుకు కోటప్పకొండ చిన్మయారణ్యం (త్రికూట) ఆశ్రమ కమిటీ సర్వం సిద్ధం చేసింది. బుధవారం సాయంత్రం 4:00 గంటలకు పట్టణంలోని కోటప్పకొండ సెంటర్ (శివుని విగ్రహం వద్ద) భక్తులు రథానికి, స్వామీజీలకు ఘన స్వాగతం పలుకుతారు.అక్కడి నుండి ఏ.టి సెంటర్ (యూటీ జంక్షన్) మీదుగా భక్తులు భారీ బైక్ ర్యాలీతో కొండపైకి వెళ్లి, మేధాదక్షిణామూర్తిని దర్శించుకుంటారు. అనంతరం కోటప్పకొండ సర్కిల్ శివుని బొమ్మ దగ్గర నుండి ప్రత్యేకంగా గుర్రాలతో సిద్ధం చేసిన రథంలో స్వామీజీల ఊరేగింపు ప్రారంభమవుతుంది. దాదాపు 500 మంది మహిళల కోలాట ప్రదర్శనలు, మంగళవాయిద్యాల నడుమ ఈ శోభాయాత్ర చిన్మయారణ్యం ఆశ్రమం వరకు అత్యంత వైభవంగా సాగనుంది.

# వినుకొండ లో యువకుడి మృతదేహం కలకలం..

- ఇది హత్యే అంటున్న మృతుడి కుటుంబ సభ్యులు
- మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ బ్రహ్మయ్య
- మృతుడు రాజు

**వినుకొండ,మే 2 (మనసులో మాట)**

వినుకొండ పట్టణంలో యువకుడి మృతదేహం లభ్యం కావడం స్థానికంగా కలకలం రేపింది.మంగళవారం నాడు పట్టణ సమీపంలోని చెక్కవాగు వద్ద కుళ్లిన స్థితిలో ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.



సమాచారం అందుకున్న రూరల్ సిఐ బ్రహ్మయ్య తన సిబ్బందితో హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు, మృతుడు వినుకొండ మండలం గొనుగుంట్లవారిపాలెం గ్రామానికి చెందిన పాలడుగు రాజు(22)గా గుర్తించారు. వృత్తిరీత్యా అతను కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజు ఆదివారం ఉదయం నుంచి కనిపించలేదని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

# మలేరియా నివారణ అవగాహన ర్యాలీ

**వేటపాలెం జూన్ 2 మనసులో మాట**



వేటపాలెం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా మంగళవారం వేటపాలెం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ, రాబోయే వర్షాకాలంలో దోమల వ్యాప్తి పెరిగి మలేరియా, డెంగీ వంటి వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల లార్వాలను గుర్తించి నిర్మూలించాలని, దోమతెరలు వినియోగించడంతో పాటు ఇళ్ల తలుపులు, కిటికీలకు మెష్‌లు అమర్చుకోవాలని సూచించారు. మలేరియా నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో దయామణి, సూపర్‌వైజర్లు మార్తమ్మ, సుధాకర్, సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఈశ్వర్ ఇంజనీరింగ్ కాలేజ్

## విద్యార్థి నైపుణ్య ఉపాధి అవకాశలే లక్ష్యం



- సాకేత్ హెచ్ఆర్ సంస్థతో ఈశ్వర్ కళాశాల మధ్య ఒప్పందం
- పల్నాడు జిల్లాలోనే తొలిసారిగా సరికొత్త భాగస్వామ్యం- కళాశాల యాజమాన్యం

**నరసరావుపేట జూన్ 02 (మనసులో మాట)::**

స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రముఖ సంస్థ సాకేత్ హెచ్ఆర్ సొల్యూషన్స్ తో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఈ ఒప్పంద కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సాకేత్ హెచ్ఆర్ సొల్యూషన్స్ డైరెక్టర్ కె.వి.సుబ్బా రెడ్డి మాట్లాడుతూ ఈ మూడేళ్ల ఒప్పందం ద్వారా విద్యార్థులకు క్యాంపస్ నియామకాలు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలను అందిస్తామన్నారు.అలాగే ఆప్టిట్యూడ్ శిక్షణ,మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్ది వివిధ ప్రతిష్టాత్మక సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తమ సంస్థ పూర్తి స్థాయిలో సహకరిస్తుందని భరోసా ఇచ్చారు.కళాశాల సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ షేక్ కరీం మోహిద్దీన్ మాట్లాడుతూ ఇటువంటి అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణ ఒప్పందాల వల్ల విద్యార్థులు పరిశ్రమల అవసరాలపై అవగాహన పెంపొందించుకోవచ్చని సూచించారు. విద్యార్థులు తమ ఉపాధి సాధన సామర్థ్యాలను మరింత మెరుగుపరుచుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

# శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో అన్నదానం



**మాచర్ల.2 జూన్ ( మనసులో మాట)**

మాచర్ల పట్టణంలో వినాయకుడి గుట్టలో వెలసిన.శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని దేవస్థానం సభ్యులు. జలగం నాగేశ్వరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రసన్నాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు: జ్యేష్ఠ బహుళ విదియ మూలా నక్షత్ర యుక్త పూజా కార్యక్రమాలు భజన సంకీర్తనలు హనుమాన్ చాలీసా పారాయణులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు హనుమంతరావు మాట్లాడుతూ ఆంజనేయ స్వామి పూజించటం వల్ల కుజ గ్రహ దోష నివారణ జరిగి శుభం కలుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జలగం నాగేశ్వరరావు. పద్మ. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# రావూరి నరసింహ వర్మ సేవలు చిరస్మరణీయం



**బాపట్ల జూన్ 2 మనసులో మాట**

తెలుగు సాహిత్య, సాంస్కృతిక వికాసం కోసం నిస్వార్థంగా సేవలందించిన సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. భావపురి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ మరియు సాహితీ భారతి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం భావపురి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన రావూరి నరసింహ వర్మ సంస్మరణ సభలో వారు మాట్లాడారు.

సభకు బాపట్ల జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. రావూరి నరసింహ వర్మ సాహితీ భారతి ద్వారా కవులు, కళాకారుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి విశిష్టతను సమాజానికి పరిచయం చేశారని భావపురి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీహరి తెలిపారు.

అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పులుగు వీర రాఘవులు, మర్రి మాల్యాద్రి రావు, దగ్గుమల్లి శామ్యూల్, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు, కే. కాళిదాసు, ఆదం షఫీ తదితరులు పాల్గొన్నారు.

# బాలికలకు హెచ్ పి వి వ్యాక్సిన్ తప్పనిసరి

## : డీపీఎంఓ డాక్టర్ సుజాత

**పెదకాకాని, జూన్ 2. మనసులో మాట:**

మండల కేంద్రమైన పెదకాకాని ప్రభుత్వ వైద్యశాల నందు మంగళవారం ఉదయం ఆశా డే మీటింగ్ నాకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ పి వి వాక్సిన్ జూన్, జులై, ఆగష్టు నెలలలో 14 సంవత్సరంలు పూర్తి అయిన బాలికలకు తప్పనిసరిగా వేయించాలని,జూన్ 28వ తేదిన నిర్వహించబడుతున్న జాతీయ పల్స్ పోలియో నిర్మూలన కార్యక్రమంలో




05 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని సమర్దవంతంగా నిర్వహించాలని తెలిపారు.

# ఆల్ఫా వృద్ధాశ్రమంలో అన్నదానం

**చిలకలూరిపేట రూరల్ జూన్ 2 మనసులో మాట**

చిలకలూరిపేట పసుమర్తి బైపాస్ రోడ్డు వద్ద గల ఆల్ఫా వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం జరిగింది వి కోటేశ్వరరావు మరియు వెంకటరత్నం భార్యాభర్తలు వారి అమ్మమ్మ కుంచాల ఆదెమ్మ జ్ఞాపకార్థం పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం జరిపించారు వారికి ఆల్ఫా వృద్ధుల ఆశ్రమం ఫౌండర్



రాంబాబు ( కాంపౌండర్) కృతజ్ఞతలు తెలియజేశారు

# "వెన్నుపోటుకు రెండేళ్లు" పోస్టర్ ఆవిష్కరణ

**మాచర్ల.జూన్2(మనసులో మాట):**

కూటమి ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి గడుస్తున్న రెండేళ్లలో చేసిన అరాచకాలు, అక్రమాలు, ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకపోవడం వంటి విషయాలకు నేటితో రెండు సంవత్సరాలు అయిన సందర్భంగా రాష్ట్ర వైసీపీ వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు వెన్నుపోటు నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు . మాచర్ల పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు .ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి . వైఎస్ఆర్సిపి సమన్వయకర్త . బూడిద శీను. కొత్తూరు పాపిరెడ్డి. షేక్ మస్తాను.పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# 18 నెలలుగా జీతం లేకుండా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి




- **ఉచిత సేవ చేస్తున్నాడా అనే ఆరోపణలు**

**వేటపాలెం జూన్ 2 మనసులో మాట**

వేటపాలెం మండలం లోని రామన్నపేట గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వరిచెర్ల సంపత్ కుమార్ గత 18 నెలలుగా జీతం లేకుండా పనిచేస్తున్నాడన్న సమాచారం పై ఆరా తీయగా ఆరోపణలు వాస్తవాలే అని సమాధానం జరుగుతుంది. గతంలో ఆయన యద్దనపూడి మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి అక్కడి నుంచి బదిలీపై చల్లారెడ్డిపాలెం గ్రామపంచాయతీలో చేరినట్లు సమాచారం. అయితే యద్దనపూడిలో కొన్ని బకాయిలు ఉండటంతో రిలీవింగ్ ఆర్డర్ లేకుండానే చల్లారెడ్డిపాలెంలో విధులలో చేరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తదనంతరం కొన్ని నెలలు క్రితం ఆయన రామన్నపేట గ్రామపంచాయతీకి బదిలీ


వరిచర్ల సంపత్ కుమార్

కాగా, గత 18 నెలలుగా వేతనం లేకుండానే విధులు నిర్వహిస్తున్నారనే అంశం వెలుగు చూడగా స్థానికంగా ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

సాధారణంగా ఉద్యోగులకు ఒకటి రెండు నెలలు వేతనాలు ఆలస్యమైతేనే ఇబ్బందులు ఎదురవుతుంటే, ఇంత కాలం వేతనం లేకుండా ఎలా విధులు నిర్వహిస్తున్నారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని, ఆరోపణలు నిజమని తేలితే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ప్రజలకు శుద్ధమైన నీటిని సరఫరా చేయాలి

## మున్సిపల్ కమిషనర్

**తెనాలి జూన్02(మనసులో మాట)**




బుర్రిపాలెం రోడ్డులో గల పురపాలక సంఘ ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం కంపోస్ట్ యార్డును మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు,ట్రైనీ కమిషనర్లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ రామ అప్పలనాయుడు కంపోస్ట్ యార్డ్ లోని సేంద్రియ ఎరువు తయారీ,కొబ్బరి పీచు తయారీ, చెత్త తరలింపు వంటి వివిధ అంశాలపై ట్రైనీ కమీషనర్లకు వివరించారు. అనంతరం. వివిఎస్ఆర్ కళాశాల వద్ద గల హెడ్ వాటర్ వర్క్స్ కేంద్రాన్ని పరిశీలించి నీటి సరఫరా,నీటి నాణ్యతను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని,నీటి యొక్క నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు.ఈకార్యక్రమంలో ట్రైనీ కమిషనర్ల బృందం, ఇన్చార్జి అసిస్టెంట్ ఇంజనీర్ భాష, సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాల సాధకుడు కాల్వ రవికి

## ప్రతిష్టాత్మక 'కళానంది' అవార్డు

- సినిమా నటులు, నిర్మాతల చేతుల మీదుగా ఘన సన్మానం




**నరసరావుపేట జూన్ 02 (మనసులో మాట)::**

సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం, అంబేద్కర్ ఆశయాల సాధన కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, అంబేద్కర్ ఆశయ సాధన సమితి జాతీయ అధ్యక్షులు కాల్వ రవి కి ప్రతిష్టాత్మక 'కళానంది అవార్డు' లభించింది. హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో మే 31న మన ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ 24 క్రాఫ్ట్ సహకారంతో, 'మన కళాక్షేత్రం ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.గత 15 సంవత్సరాలకు పైగా భారత కరెన్సీ నోట్లపై రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని ముద్రించాలంటూ కాల్వ రవి దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన ప్రజల కోసం చేసిన సామాజిక సేవలను సాగించిన పోరాటాలను గుర్తిస్తూ నిర్వాహకులు ఈ అవార్డును ప్రకటించారు.ఈ ఘన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖ సినీ నటులు,చలనచిత్ర నిర్మాతలు కాల్వ రవికి 'కళానంది అవార్డు'ను అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సినీ ప్రముఖులు మాట్లాడుతూ సమాజ మార్పు కోసం అంబేద్కర్ ఆశయాల కోసం కాల్వ రవి చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని కొనియాడారు. తన సేవలను గుర్తించి ఈ అవార్డును అందించినందుకు కాల్వ రవి నిర్వాహకులకు మరియు సినీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, అంబేద్కర్ ఆశయ సాధన కోసం తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

# ఉపాధి హామీ లో రెండు పూటలా హాజరు విధానాన్ని రద్దు చేయాలి

- **వ్యవసాయకార్మికసంఘం జిల్లా నాయకులు. బి. అగస్టీన్.**

**చుండూరు జూన్ 2 మనసులో మాట**



మంగళవారం చుండూరు మండలం పెనుగుదురుపాడు లో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని అగస్టీన్ సందర్శించి కార్మికులకు పనిలో ఎదురౌతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అగస్టీన్ మాట్లాడుతూ ఉపాధి పనిరోజులు 100 నుండి 125 రోజులు కి పెంచామ ని ప్రచారం చేశారని, ప్రతి కుటుంబానికి 125 రోజులు పని గ్యారంటీ గా చూపాలని, లేదా నిరుద్యోగభృతి చెల్లించాలని డిమాండ్ చేసారు.ఉపాధిలో పేస్ యాప్ వల్ల హాజరు పడక కొంతమంది కార్మికులు పని కోల్పోతున్నారని, ఆరోపించారు.రెండు పూటలా హాజరు ఇబ్బంది గా ఉందని కార్మికులు తెలిపారని,అసలు ఉపాధి పని కొలతల పని అయినప్పుడు ఎంత పని చేస్తే అంతపని కే వారికి డబ్బులు ఇస్తున్నారని , అటువంటప్పుడు రెండో ఫొటో అవసరం ఏముందని ప్రశ్నించారు. పేస్ యాప్ రద్దు చేయాలని, లేదా పేస్ యాప్ ద్వారా హాజరు పడని వారికి బయోమెట్రిక్ ద్వారా వేలి ముద్ర ల ద్వారా హాజరు తీసుకునే వెసులుబాటు కల్పించాలని, సమ్మర్ అలవెన్స్ ను పునరుద్ధరించాలని , ఉపాధి కార్మికులందరికి పనిముట్లు ఇవ్వాలని, మేట్లు కి పారితోషకం ఇవ్వాలని, పే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేసారు.

# "వెన్నుపోటుకు రెండేళ్లు" పోస్టర్ ఆవిష్కరణ



**గుంటూరు, జూన్ 2( మనసులో మాట):**

కూటమి ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి గడుస్తున్న రెండేళ్లలో చేసిన అరాచకాలు, అక్రమాలు, ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకపోవడం వంటి విషయాలకు నేటితో రెండు సంవత్సరాలు అయిన సందర్భంగా రాష్ట్ర వైసీపీ వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి రాంబాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు వెన్నుపోటు నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు . గుంటూరు పట్టణం లోని బృందావన్ గార్డెన్స్ లో గల జిల్లా పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు .ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు అంబటి రాంబాబు, పొన్నూరు వైఎస్ఆర్సిపి సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ, తెనాలి సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్, గుంటూరు ఈస్ట్ సమన్వయకర్త నూరి ఫాతిమా , తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త డైమండ్ బాబు పలువురు తదితర నాయకులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలా కేసులో నలుగురు అరెస్ట్

- పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కొడుకు నిందితుడు
- 18 గ్రాముల ఎండిఎంఏ స్వాధీనం

**గుంటూరు, జూన్ 2( మనసులో మాట):**

మాదకద్రవ్యాలు సేవిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కొడుకుతో సహా మరో నలుగురు యువకులను పోలీసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని వీరిపై కేసు నమోదు చేశారు.

గుంటూరు ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కొడుకు, మరో నలుగురు యువకులను పాతగుంటూరు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నందివెలుగు రోడ్డులోని రైల్వే ట్రాక్ సమీపంలో యువకులు మాదకద్రవ్యాలు సేవిస్తున్నట్లు పోలీసులకు.అందిన రహస్య సమాచారంతో, సీఐ వెంకట ప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. పాలవాయి హరికృష్ణ, మిరియాల సాయితేజ, బాదినేడి నాగార్జున, కొమ్మూరి సాయిప్రకాశ్‌లు అరెస్టు చేసిన వారిలో ఉన్నారు. వీరి నుంచి సుమారు 18 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# భక్తి శ్రద్ధ లతో అంకాలమ్మ తల్లికి బోనాల సమర్పణ





**గురజాల, జూన్ 02 :(మనసులో మాట ):**

గురజాల లో గ్రామ దేవత అంకాలమ్మ తల్లికి భక్తులు భక్తి శ్రద్ధ లతో బోనాలు సమర్పించారు.ఉదయం నుండే పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ని దర్శనం చేసుకొని మొక్కలు చెల్లించారు.అర్చకులు అమ్మవారి కి ప్రత్యేక అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ప్రతీ సంవత్సరము వర్షాలు కోసం అమ్మవారి కి బోనాలు సమర్పించటం ఆనవాయితి.


SRI KANCHERLA ATCHUTA RAO
PROUDLY PRESENTS
SSLS CREATIONS
Yadha Kumar's
- VICTORY OVER ENEMIES
COMING SOON
PRODUCER K. UPENDRA
DIRECTOR YADHA KUMAR
CO PRODUCERS K SUBBA LAKSHMI, K SUNITHA
GUNA SEKHARAN RAGHU KUNCHE SHYAM KUMAR .P PRASADULA MADHU BABU DRAGON PRAKASH LOOKS RAJSEKHAR
UTTAR KUMAR CHANDU RAMESH SURYANARAYANA TRINADH BABU K. JANARDHAN SURYA CHANDRA RAMANA PUSHYAMI SURYA PRAKASH RAO
SFX